వార్డు ప్లానింగ్ కార్యదర్శుల బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్‌ఎండీ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలోని పట్టణ ప్రణాళికా విభాగంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వార్డు ప్లానింగ్ కార్యదర్శులను ఇతర మున్సిపాలిటీలకు డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ సంజీవ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఐదుగురు అధికారులతో పాటు మరో ఆరుగురు ప్లానింగ్ సెక్రటరీలపై అవినీతి ఆరోపణలు రావడంతో ఈ నెల 12 నుంచి 15 వరకు విచారణ కమిటీ అధికారులు విచారణ చేశారు. అంతే కాకుండా మరిన్ని వివరాలు ఇవ్వాలని రీజినల్ డైరెక్టర్ అప్పిలేట్ కమిషనర్ పి.విశ్వనాథ్ నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబుకు 23న లేఖ రాశారు. గతంలో ఇక్కడ పని చేసి బదిలీపై వెళ్లిన అధికారులు, ప్లానింగ్ సెక్రటరీలు అవినీతికి పాల్పడ్డారని ఓ వ్యక్తి సీఎంకు ఫిర్యాదు చేసిన మేరకు అధికారులు విచారణ చేశారు. అయితే ఐదుగురు అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం ప్లానింగ్ సెక్రటరీలను బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. 33వ సచివాలయంలో పని చేస్తున్న వి.దివ్య, 54వ సచివాలయ కార్యదర్శి ఎన్.రూపను నందికొట్కూరుకు, 93వ సచివాలయ కార్యదర్శి యు.నవీన్‌కుమార్‌ను ఆత్మకూరు, 64వ వార్డు సచివాలయ కార్యదర్శి ఎం.రంగనాథ్‌ను బేతంచెర్ల నగర పంచాయితీ, 90వ సచివాలయ కార్యదర్శి షణ్ముక్‌ను గూడూరు నగర పం చా యతీ, 55వ సచివాలయ కార్యదర్శి ఎస్ఎండీ రఫీక్‌ను ఆదోని మున్సిపాలిటీకి డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు.

నేడు ఉర్దూ వర్సిటీలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ లోక్‌నాథ్ తెలిపారు. పీజీ సెట్-2024లో అర్హత సాధించిన అభ్యర్థులతో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ కింద భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ ఉర్దూ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్సు, ఎంఏ ఉర్దూ, ఎమ్మెస్సీ కంప్యూటర్స్ సైన్సు, ఎమ్మెస్సీ బాటనీ, ఎంఏ ఉర్దూ, ఎమ్మెస్సీ జువాలజీ, ఎమ్మెస్సీ ఇండస్ట్రీయల్ కెమిస్ట్రీలో పీజీసెట్ అర్హత సాధించిన విద్యార్థులు అర్హులని వెల్లడించారు. తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఈనెల 29వ తేదీ కళాశాలలో అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 99597 58609 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కేఎంసీని కాపాడుకుంటాం

రోడ్డెక్కిన జూనియర్ డాక్టర్లు


కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ



6లో

పదికి ప్రణాళిక

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి.. ప్రతి విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన దశ. టెన్త్‌లో సాధించే మార్కులు, సబ్జెక్టు నైపుణ్యాలు భవితకు పునాదులుగా నిలుస్తాయి. అందుకే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి అత్యధిక మంది విద్యార్థులు మెరుగైన ఫలితాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది మరింత మెరుగైన ఉత్తీర్ణత సాధించడానికి కసరత్తు చేపడుతోంది. గతంలో జరిగిన లోటుపాట్లను సవరించుకుని ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కార్యరూపం చేయాలని జిల్లా విద్యాశాఖ స్పష్టమైన ప్రణాళికను రూపొందించింది. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ మెరుగైన విద్యాభ్యాసానికి ముందుకు వెళ్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షలకు ఇప్పటి నుంచే విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారు. నవంబరు ఒకటో తేదీ నుంచే బడి సమయానికి గంట ముందు ఉదయం 8 గంటలకు బడి ముగిశాక సాయంత్రం నాలుగు గంటలకు స్టడీ అవర్స్ నిర్వహిస్తోంది. ప్రతిరోజు ఒక్కో సబ్జెక్టు ఉపాధ్యాయుడు స్టడీ అవర్ నిర్వహించి వారికి పాఠ్యాంశాల్లో సందేహాలను నివృత్తి చేస్తారు. వారానికి ఒకసారి పరీక్షలు నిర్వహించి వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.





- పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధం
- ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- డిసెంబరు ఆఖరి నాటికి సిలబస్ పూర్తి
- మెరుగైన ఫలితాల సాధనకు జిల్లా విద్యాశాఖ యాక్షన్ ప్లాన్
- తెలుగు మాధ్యమంలో రాసేందుకు అవకాశమిచ్చిన ప్రభుత్వం

● గత మూడేళ్ల ఫలితాలు ఇలా

ఏడాది	హాజరైన విద్యార్థులు	పాసైన విద్యార్థులు	ఉత్తీర్ణత శాతం
2021-22	28184	16164	57.35
2022-23	28,786	17439	60.58
2023-24	30,000	16,200	62.47
2024-25	32000		

● వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

కర్నూలు జిల్లాలో 521 ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక, గురుకుల, కేజీబీవీ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మార్చిలో జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలకు 32 వేల మందికి పైగా విద్యార్థులు హాజరుకానున్నారు. వీరంతా వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. అందుకోసం 100 రోజుల ప్రణాళికను రూపొందించారు. గత ఏడాది 2023-24 లో కర్నూలు జిల్లాలో 30,802 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 19,242 ఉత్తీర్ణత సాధించి 62.47శాతం ఉత్తీర్ణత శాతంగా నిలిచింది. గత ఏడాది లోటుపాట్లను సవరించుకుని ముందుగానే మెరుగైన ఫలితాలు సాధనకు ప్రయత్నిస్తున్నారు.

● డిసెంబరు ఆఖరి నాటికి సిలబస్ పూర్తి

పాఠశాలల్లో ఇప్పటికే ఉపాధ్యాయులు 85శాతం సిలబస్ పూర్తి చేశారు. మిగిలిన సిలబస్ డిసెంబరు ఆఖరు నాటికి పూర్తి అయ్యేలా జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ ఆదేశాలు జారీ చేశారు. 100రోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యేకంగా వెనకబడిన విద్యార్థులను కనీస మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా వారికి ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తున్నారు. ప్రతిరోజు పాఠ్యాంశాల వారీగా టెస్టులు నిర్వహించి మెరుగైన స్థాయికి చేరేలా కృషి చేయాలని సూచించారు. జనవరి నుంచి విద్యార్థులు వార్షిక పరీక్షలకు ప్రిపేర్ అయ్యేలా చూస్తున్నారు. ఇదిలా ఉండగా గత వైసీపీ ప్రభుత్వం సీబీఎస్ఈ తరహా పరీక్షలను ఆంగ్లంలో రాసే విధంగా చేపట్టడంతో గ్రామీణ పేద ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు అవస్థలు పడ్డారు. కనీస మార్కులు కూడా రాక చతికిల పడ్డారు. ఉత్తీర్ణత శాతం భారీగా పడిపోయింది. కూటమి ప్రభుత్వం ఇలాంటి పొరపాట్లను సరిదిద్ది ఈ ఏడాది నుంచి తెలుగు మాధ్యమంలోనూ పదో తరగతి వార్షిక పరీక్షలను రాసే అవకాశాన్ని విద్యార్థులకు కల్పించింది. దీంతో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం కూడా పెరిగే అవకాశం ఉంది.

● ప్రతి ఒక్కరూ పాస్ కావాలన్నదే లక్ష్యం



మార్చిలో జరిగే పదో తరగతి వార్షిక పరీక్షల కోసం విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను సన్నద్ధం చేశాం. అందుకు తగ్గ యాక్షన్ ప్లాన్ రూపొందించాం. చదువులో వెనుకబడిన విద్యార్థులను ఇప్పటినుంచే వారిని పరీక్షలకు సిద్ధం చేసి మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించాము. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని దత్తత తీసుకుని ప్రతిరోజు సందేహాలు నివృత్తి చేసి, పాఠ్యాంశాల వారీగా స్లిప్ టెస్టులు నిర్వహించి మంచి మార్కులతో ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా చూస్తున్నాం. గతంకంటే మెరుగైన ఫలితాలు సాధించాలన్నదే మా లక్ష్యం. గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకొని వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం.

- శ్యామ్యూల్ పాల్, డీఈఓ, కర్నూలు

● సందేహాలను నివృత్తి చేస్తున్నారు



ఉదయాన్నే బడికి రావడంతో ఉపాధ్యాయుల చెప్పిన పాఠాలు చక్కగా గుర్తుంటాయి. ప్రశాంతమైన వాతావరణంలో తమను ఉపాధ్యాయులు చదివిస్తున్నారు. రోజూవారీగా ఉదయం, సాయంత్రం వేళల్లో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు చదివిస్తున్నారు. తరగతి గదిలో నేర్చుకున్న పాఠాల్లో ఉన్న సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు.

- సాయి చరణ్, నెహ్రూ మెమోరియల్ పాఠశాల, ఆదోని

● పరీక్షల భయం పోగొడుతున్నారు



సిలబస్ దాదాపుగా పూర్తయింది. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు సిలబస్ పూర్తిచేసి వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపుతున్నారు. ఎప్పటికప్పుడు స్లిప్ టెస్‌లు నిర్వహించి పరీక్షలు అంటే భయం పోగొట్టే విధంగా ఉపాధ్యాయులు మాకు శిక్షణ ఇస్తున్నారు.

- రీతిక, విద్యార్థిని, ఆదోని



రాష్ట్రంలోనే మొదటిసారి..

'పది' విద్యార్థులకు వర్చువల్ క్లాస్ రూం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా వర్చువల్ క్లాస్ రూం ద్వారా జిల్లాలోని 10వ తరగతి విద్యార్థులకు బోధనా తరగతులు ప్రారంభం కానున్నాయనీ కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్చువల్ క్లాస్ రూం ట్రయల్ రన్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం పాఠశాల, ఇందిరాగాంధీ మెమోరియల్ పాఠశాల విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో వర్చువల్ విధానం ద్వారా పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించబోతున్నామన్నారు. అధునాతన సాంకేతిక పరికరాలతో జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో స్టూడియోను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని 352 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బోధన అందించేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 119 పాఠశాలలకు బోధన అందించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయన్నారు. త్వరలో అన్ని పాఠశాలలకు కనెక్ట్ అయ్యేలా ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. వివిద సబ్జెక్టులకు సంబంధించిన 42 మంది అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు వర్చువల్ విధానం ద్వారా బోధన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్టూడియో ద్వారా పాఠశాలలకు ప్రత్యక్ష ప్రసారం చేసేటప్పుడు ఎలాంటి ఆటంకాలు లేకుండా పిల్లలకు స్పష్టంగా కనిపించేలా ఇంటర్నెట్ కనెక్షన్ విధానాన్ని పెంచాలని డీఈవో అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



వర్చువల్ క్లాస్ రూమును పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, డీఈవో శ్యామూల్ పాల్



జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్

మహనీయుడు జ్యోతిరావుపూలే: కలెక్టర్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావుపూలే అని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. నగరంలోని బిర్లాగేట్ సర్కిల్‌లో జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాజ్యోతిరావు పూలే బాలికలకు పాఠశాలను స్థాపించి స్త్రీ విద్యను ప్రోత్సహించారన్నారు. మానవహక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. ఆయన ఆశయాలను అనుసరించి ఉన్నత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీబీసీడబ్ల్యూఓ వెంకటలక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాకీర్ హుశేన్, బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం నాయకులు కె.వెంకటేశ్వర్లు, నాయకులు శేషఫణి, ధనుంజయ ఆచారి, వేంపెంట రాంబాబు, పట్నం రాజేశ్వరి, శకుంతల పాల్గొన్నారు.

జీడీపీకి నీటి విడుదల

- హంద్రీ నీవా నుంచి రోజుకు 60 క్యూసెక్కులు
- తాగు, సాగు నీటికి ఇక్కట్లు తీరినట్లే
- 15 వేల ఎకరాల్లో సాగుకు సిద్ధమైన రైతులు

గోనెగండ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టుకు హంద్రీనీవా(హెచ్ఎన్ఎస్) నుంచి అధికారులు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం రోజుకు 60 క్యూసెక్కుల ప్రకారం హంద్రీనీవా నుంచి జీడీపీకి చేరుతుంది. దీంతో ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు రైతులకు, తాగునీటి పథకాలకు ప్రస్తుతం పరస్థితులలో గాని వచ్చే వేసవిలో గాని తాగునీటి కష్టాలు తీరినట్లే. ప్రసుత్తం ప్రాజెక్టులో 2.2 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఐఏబీ సమావేశంలో నీటి విడుదలకు గ్రీన్ సిగ్నల్ రావడంతో అధికారులు వేగవంతంగా చర్యలు తీసుకున్నారు. జీడీపీ కింద 15వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేయాల్సిఉంది. అందుకు గాను రైతులు కూడా తమ భూములను సాగుకు సిద్ధం చేసుకున్నారు. నీటి విడుదలైన వెంటనే విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్నారు. రెండు రోజుల్లో నీటి విడుదలకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఆయకట్టు రైతులు సైతం నీటి విడుదల చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. నీటి విడుదలకు నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధుల ఆదేశాల కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఈ ఏడాది 15 వేల ఎకరాలు సాగు కానుంది. ప్రాజెక్టు కింద బండగట్టు, డోన్, క్రిష్ణగిరి, కోడుమూరు, గూడూరు, కర్నూలు, బెళగల్ తదితర ప్రాంతాల తాగునీటి పథకాలకు కూడా నీరు విడుదల కావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న 2.2 టీఎంసీకి హంద్రీనీవా నీరు తోడు కావడతో ఇక తాగునీటి పథకాలకు, సాగునీటికి ఇబ్బంది ఉండదు. శ్రీశైలం బ్యాంక్ వాటర్ తగ్గే వరకు హంద్రీనీవా నుంచి నీటి విడుదల కొనసాగుతుంది.



గాజులదిన్నె ప్రాజెక్టుకు ప్రవహిస్తున్న హంద్రీనీవా జలాలు

ఒక రోజు ముందే సామాజిక పింఛన్లు

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ఒకటో తేదీ సెలవు వస్తే ముందు రోజే పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటోంది. తాజాగా డిసెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో నవంబరు 30వ తేదీనే పింఛన్లు పంపిణీ చేయాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో డీఆర్‌డీఏ అధికారులు ఈ మేరకు పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం నగదు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవోలు పురపాలక మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. కర్నూలు జిల్లాలో 2,40,330 మంది లబ్ధిదారులకు రూ.102.55 కోట్లు మంజూరయ్యాయి. అదేవిధంగా రెండు నెలలు వరుసగా పింఛన్ తీసుకోకపోయినా మూడు నెలల మొత్తం సొమ్ము తీసుకునే అవకాశాన్ని కూడా కల్పించింది. పింఛన్ తీసుకుంటున్న కుటుంబ యజమాని మరణిస్తే అతనిపై ఆధారపడిన భార్య వితంతు లేదా వృద్ధాప్య పింఛన్ పొందేందుకు వైసీపీ ప్రభుత్వ హయాంలో నెలల సమయం పట్టేది. ప్రభుత్వం ఈ సమస్యను సానుకూలంగా పరిష్కరించింది.

నూతన భవన నిర్మాణంపై ఈఎన్‌సీ ఆరా

● నివేదికలు సమర్పించాలని కమిషనర్‌కు లేఖ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న నగర పాలక భవన నిర్మాణంపై ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆరా తీస్తున్నారు. భవన నిర్మాణ సమయంలో పునాదులు తీస్తున్నప్పుడు భూమిలో కఠినమైన రాయి ఉందని..దాని కోసం ప్రత్యేకంగా మిషన్లు తెప్పించి తొలగించినట్లు అధికారులు గతంలో నిర్ధారించారు. అయితే ముందుగా అనుకున్నట్లు టెండరు సమయంలో కఠినమైన రాయి ప్రస్తావన లేదు. ఈ క్రమంలో పునాదులు తీసే సమయంలో ప్రత్యేకంగా కఠినమైన రాతి పరిమా ణాన్ని అదనపు అంశంగా రూ.1.82 కోట్లతో చేర్చారు. ఈ మేరకు ఈఎన్‌సీ కార్యాలయానికి పంపిన నివేదికలకు సంబంధించి పని స్లిప్‌ను తిరస్కరించారు. కఠినమైన రాతి పరిణామం అంశాన్ని ఏ విధంగా చేర్చారని ప్రశ్నిస్తున్నారు. దాని కోసం ఖర్చు పెట్టి వివరాలకు సమర్ధన నివేదిక, సూపరింటెండింగ్ ఇంజనీర్ ధృవీకరణతో పాటు సాయిల్ ఇన్వెస్టిగేషన్ రిపోర్టు, (మట్టి అధ్యయన నివేదిక), ఎం. బుక్స్ ద్వారా ప్రామాణీకరించిన జస్టిఫికేషన్ రిపోర్టును కార్యాలయంలో సమర్పించాలని లేఖలో పేర్కొన్నారు.

● ఓ అధికారి నిర్వాకం..

కేవలం నగర పాలక సంస్థలో ఓ అధికారి నిర్వాకం వల్లే ఇదంతా జరుగుతున్నదని కొందరు భావిస్తున్నారు. ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లిన వారిపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా ఇదంతా చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఈఎన్‌సీతో ఇక్కడ పని చేస్తున్న ఓ ఉన్నతాధికారి స్నేహపూరితంగా ఉండటంతో కావాలనే విషయాలను బయటికి తీస్తున్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారి తీరుపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కావాలనే భయపెట్టి డబ్బు వసూలు చేయాలని చూస్తున్నట్లు కొందరు గుసగుసలాడుతున్నారు.



మనదేశం సంప్రదాయ కళలకు పుట్టినిల్లు. ఇక్కడ పుట్టిన కళలకు విశేష ఆదరణ ఉంది. 64 రకాల లలిత కళల్లో ఎందరో తమ ప్రతిభను కనబరుస్తూ ఉన్నారు. ఇందులో భాగంగానే చిత్రలేఖనంలో కూడా చాలా మంది రాణిస్తున్నారు. వీరిలో కేరళకు చెందిన రాజా రవివర్మ 18వ శతాబ్దంలోనే చిత్రలేఖనంలో అద్భుతాలు కళాఖండాలను సృష్టించారు. వీరినే ఆదర్శంగా తీసుకున్న ఆత్మకూరుకు చెందిన షేక్‌మహ్మద్‌షఫి (చిన్ని) చిత్రలేఖనం కళపై తన ఆసక్తిని చాటుకున్నాడు. 1992లో పాణ్యంలో ఇంటర్మీడియట్ ఫెయిల్ అవడంతో షఫికి ఏం చేయాలో దిక్కుతోచలేదు. తనకు చిన్నతనం నుంచే పెయింటింగ్ పట్ల మక్కువ ఉండటంతో 79 ఏళ్ల రిటైర్డు డ్రాయింగ్ మాస్టర్ కంబగిరి రాజు వద్దకు వెళ్లి తనకు డ్రాయింగ్ నేర్పించాలని కోరాడు. తనకు వయస్సు మళ్లిందని, నేర్పించడం చేతకావడం లేదని మాస్టారు చెప్పినా బతిమిలాడి మరీ చిత్రలేఖనంలో శిక్షణ పొందాడు. తొలుత కాగితాలపై పెన్సిల్‌తో బొమ్మలు గీయడం నేర్చుకున్నాడు. ఆ తర్వాత రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు వెళ్లి చిత్రలేఖనంలో మరెన్నో మెలకువలు నేర్చుకున్నాడు. అనంతపురం జిల్లాలోని గుంతకల్లులో కట్‌ఔట్స్‌పై పెయింటింగ్ వేయడం, హైద్రాబాద్‌లో 400 అడుగుల సైజ్‌గల బోర్డులపై బొమ్మలు వేయడం, అక్షరాలు రాయడం నేర్చుకున్నాడు. విజయవాడ, గుంటూరులలో ఔట్‌డోర్ పబ్లిసిటీ వర్క్‌లను కూడా ఆకళింపు చేసుకున్నాడు. దాన్నే ఉపాధిగా ఎంచుకున్నాడు.



ఆత్మకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):

ఆర్ట్

కళతోనే ఉపాధి : పాణ్యంలోని రిటైర్డు పోస్టుమాస్టర్ ఖాశీం, షేకున్‌బీ దంపతుల కుమారుడైన షఫి ఇంటర్ ఫెయిల్ అవడంతో తన తల్లిదండ్రులు ఏదో ఒక పని చూసుకోమని సూచించారు. అయితే డ్రాయింగ్ పట్ల షఫి ఆసక్తి చూపగా అందుకు తల్లిదండ్రులు నిరాకరించారు. వారు వద్దనా వినకుండా అందులోనే తన ఉపాధిని పదిలపర్చుకున్నాడు. 2000 సంవత్సరంలో ఆత్మకూరులో వివాహం చేసుకోవడంతో ఇక్కడే చిన్ని ఆర్ట్స్ షాప్‌ను ప్రారంభించి తన కళతోనే సంపాదన వైపు దృష్టి సారించాడు. అప్పట్లో గ్రాఫిక్స్‌తో కూడిన ఫ్లెక్సీలు లేకపోవడంతో ఎనామిల్, వాటర్ కలర్స్, ఆయిల్ పెయింటింగ్‌తో తయారయ్యే బ్యానర్లు, ఇతర పెయింటింగ్ వర్కులకు విశేష ఆదరణ ఉండేది. ప్రతిరోజూ తీరిక లేనంత పని ఉండేది. అయితే సాంకేతికరంగం అభివృద్ధిలో భాగంగా డిజిటల్ రంగం అభివృద్ధి చెంది గ్రాఫికల్ ఫ్లెక్సీలు అందుబాటులోకి రావడంతో ప్రస్తుతం చేతి రాతతో కూడిన బ్యానర్లకు ఆదరణ తగ్గింది. దీంతో 2015లో చిన్ని ఆర్ట్స్‌ను మూసివేసి అవకాశం దొరికినప్పుడులా డ్రాయింగ్ పనులను చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.



నల్లమల అటవీ ప్రాంతంలో బోర్డులపై బొమ్మలు వేస్తున్న ఆర్టిస్టు చిన్ని

కుంచె కదిపితే అద్భుతాలే..!

- చిత్రలేఖనంలో విశేష ప్రతిభ
- కళలో ఉపాధిని ఎంచుకున్నవైనం







అటవీ శాఖలో అందివచ్చిన అవకాశాలు

చిత్రలేఖనంలో అద్భుత ప్రతిభను సొంతం చేసుకున్న షఫికి ఆత్మకూరు అటవీశాఖ అధికారులు ఎన్నో అవకాశాలను కల్పించారు. డ్రాయింగ్‌లో చిన్ని ట్యాలెంట్‌ను గుర్తించి 2005లో అప్పటి ఆత్మకూరు డీఎఫ్‌వో అశోక్‌కుమార్ అటవీశాఖ పరిధిలో ఏర్పాటు చేసే వివిధ సూచిక బోర్డులపై చిత్రాలతో కూడిన రాతలు రాయించారు. అందరూ అభినందించే రీతిలో చిన్ని అటవీశాఖ బోర్డులపై అద్భుతమైన కళాఖండాలను జాలువార్చడంతో అప్పటి నుంచి నేటి వరకు అటవీశాఖలో ప్రతి పెయింటింగ్‌ను చిన్నితో వేయిస్తున్నారు. చిన్ని వేసే బొమ్మలన్ని జీవం ఉట్టిపడేటట్లుగా ఎంతో ఓపికతో తన కళను ప్రతిబింబిస్తున్నాడు. ఏ చిన్న పొరపాట్లకు తావివ్వకుండా గ్రాఫికల్‌తో తయారైన డిజైన్‌గా భావించేట్టుగా తన చిత్రలేఖన ప్రతిభను కనబరుస్తున్నాడు. ఆత్మకూరు డివిజన్‌లోని నాగలూటి, బైర్లూటి, ఆత్మకూరు, శ్రీశైలం, వెలుగోడు రేంజ్‌లో వందలాది బోర్డులపై వన్యప్రాణులు, పక్షుల బొమ్మలను వేసి వాటిపై సూచికలను పొందుపరుస్తున్నాడు. చిన్ని ప్రతిభను గుర్తించిన మార్కాపురం అటవీ డివిజన్ వారు సైతం చిన్నితో తమ డివిజన్ పరిధిలో కూడా వన్యప్రాణుల, పక్షి బొమ్మలను వేయించేలా అవకాశం ఇస్తున్నారు. కాగా చిన్ని గురించి తెలుసుకున్న నెల్లూరులోని నేలపట్టు, పులికాట్ సరస్సు తదితర ప్రాంతాల వారు కూడా చిన్నిని పిలిపించుకుని తమ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే సూచిక బోర్డుల్లో పక్షుల బొమ్మలను గీయించుకుంటున్నారు. ఇలా తన కళతో చిత్రలేఖన కళాకారులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కర్నూలు - గుంటూరు అటవీ రహదారిపై చిన్ని వేసిన చిత్రాలు పర్యాటకుల్ని, ప్రయాణికుల్ని ఎంతో ఆకట్టుకుంటున్నాయి.

చిత్రలేఖనం కళకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలి



భారతీయ సంప్రదాయాల్లో లలితకళలకు విశేష ఆదరణ ఉండేది. అలాంటిది నేడు కళల పట్ల ఆదరణ కరువవుతోంది. వీటిలో చిత్రలేఖనం పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. గ్రాఫికల్ టెక్నాలజీ కూడిన ఫ్లెక్సీల తయారీ జరుగుతుండటంతో చాలా మంది పెయింటింగ్‌తో కూడిన చిత్రాలు, వాల్ రైటింగ్స్, బ్యానర్లు తదితర వాటిపై ఆసక్తి చూపడం లేదు. తక్కువ ధరలకే ఫ్లెక్సీలు తయారవుతుండటంతో జనం వాటిపైనే మక్కువ చూపుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వాలు కూడా డ్రాయింగ్ టీచర్ల నియామకం చేపట్టడం లేదు. దీంతో చిత్రలేఖనంలో రాణించాలన్న కోరిక కూడా నేటి తరంలో లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాయింగ్ టీచర్ల నియామకం చేపట్టేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

- షేక్‌మహ్మద్‌షఫి(చిన్ని), ఆర్టిస్ట్, ఆత్మకూరు

లోటుపాట్లు లేకుండా సాగు నీటి సంఘాల ఎన్నికలు జరపండి



కర్నూలు కలెక్టరేట్ నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో లోటుపాట్లు లేకుండా పటిష్టంగా సజావుగా చేపట్టాలని జలవనరుల శాఖ స్పెషల్ సీఎస్ జి. సాయిప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ కార్యాలయం నుంచి సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ అంశంపై కలెక్టర్లతో జలవనరుల శాఖ స్పెషల్ సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ సీఎస్ సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై డివిజన్ స్థాయిలో శిక్షణా తరగతులు నిర్వహించాలని, సజావుగా ఎన్నికలను నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని స్పెషల్ సీఎస్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. డిసెంబరు 5వ తేదీన నోటిఫికేషన్ ఇస్తామని తెలిపారు. డిసెంబరు 8వ తేదీన ప్రాదేశిక నియోజకవర్గం వాటర్ యూజర్స్ అసోసియేషన్‌కు ఎన్నికలు ఉంటాయని, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 11వ తేదీన ఎన్నికలు, ప్రాజెక్ట్ కమిటీలకు 14వ తేదీన ఎన్నికలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అధికారుల నియామకం పూర్తి చేశామన్నారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, జలవనరుల శాఖ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, డీఈలు పాల్గొన్నారు.

కేఎంసీని కాపాడుకుంటాం

- రోడ్డెక్కిన జూనియర్ డాక్టర్లు
- సంఘీభావం ప్రకటించిన ఏపీజీడీఏ
- కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ

కర్నూలు హాస్పిటల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'కర్నూలు మెడికల్ కళాశాల మాది.. ఈ కాలేజీని కాపాడుకోవడం మా హక్కు. ప్రాణాలైనా అర్పించి కేఎంసీ స్థలాన్ని కాపాడుకుంటాం..' అంటూ జూనియర్ డాక్టర్లు గర్జించారు. కర్నూలు మెడికల్ కాలేజీకి సంబంధించిన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ ఏపీ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్, ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ)ల ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులు బుధవారం కాలేజీ ప్రవేశ ద్వారం ఎదుట నిరసనకు దిగారు. అనంతరం కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు 600 మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏపీజీడీఏ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, కోశాధికారి డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రోడ్డు వెడల్పులో తొలగిస్తున్న 8 షాపులకు కాలేజీలో స్థలాన్ని కేటాయించడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయన్నారు. కళాశాల ఎదుట ఉన్న షాపులకు రైతుబజారులో స్థలాన్ని కేటాయించారనీ, అక్కడికి వెళ్లకుండా కేఎంసీ స్థలాన్ని అడగడం.. అందుకు మున్సిపల్ అధికారులు వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. జూడాల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జగదీష్, ఉపాధ్యక్షుడు డాక్టర్ సాయికుమార్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీలో ఆక్రమణలను అడ్డుకుంటామని, అవసరమైతే ప్రాణాలైనా అర్పించి కాలేజీని కాపాడుకుంటామన్నారు. కాలేజీ, గ్రౌండ్స్ మాసొత్తు అని వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, నర్సులను కలుపుకుని తాము మరింత ఉద్యమిస్తామన్నారు. కాలేజీ ముందు అనధికారికంగా షాపులు ఉన్నాయని, రోడ్డు విస్తరణలో వాటిని తొలగించి మరో చోట స్థలాలు ఇవ్వాలే కానీ, విద్యాసంస్థలకు చెందిన స్థలాలను ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. కళాశాల స్థలాన్ని పరులపాలు కాకుండా కాపాడుకుంటామన్నారు. అనంతరం జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ నాయకులు జగదీష్, సాయికుమార్, ఆదివిష్ణు, కుమార రాజా తదితరులు డీఆర్వో, కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



ర్యాలీ చేస్తున్న వైద్య విద్యార్థులు

సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు

- నిబంధనల సడలింపు
- ఫలించిన సీఎం విజ్ఞప్తి



పెంచికలపాడు కేంద్రంలో పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న సెక్రటరీ సుందర్‌రాజు, సూపర్‌వైజర్ శ్రీను

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలులో భారత పత్తి సంస్థ (సీసీఐ) నిబంధనల వల్ల రైతులు పత్తిని అమ్మలేక, దళారులకు విక్రయించి నష్టపోతున్నారు. ఈ పరిస్థితిని నివారించేందు కోసం నిబంధనలను సడలించాలని సీఎం చంద్రబాబునాయుడు ఇటీవల వ్యవసాయ శాఖ కేంద్ర మంత్రికి లేఖ రాశారు. దీంతో రెండు రోజుల కింద కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో సీసీఐ సంస్థ అధికారులు నిబంధనలను సడలించినట్లు కర్నూలు మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణ మూర్తి విలేకరులకు తెలిపారు. కర్నూలు జిల్లాలో 12 సీసీఐ కేంద్రాలను ఏర్పాటయ్యాయని, ఇప్పటి దాకా 3,181 మంది రైతుల నుంచి 4,704 లక్షల విలువ చేసే 63,924 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు ఏడీఎం నారాయణ మూర్తి తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవగాహన కల్పించి, సడలించిన నిబంధనల మేరకు రైతుల నుంచి సీసీఐ అధికారులు పత్తిని కొనుగోలు చేసేలా మార్కెట్ కమిటీల సెక్రటరీలు, సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలని ఆదేశించామన్నారు.

జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

- ముగిసిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు



ఫెన్సింగ్ విజేతలతో డీఈఓ, డీఎస్‌డీఓ

నంద్యాల, నవంబరు 28 : (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగే ఫెన్సింగ్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు పతకాలు తీసుకురావాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజు అన్నారు. నంద్యాలలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో మూడురోజుల నుంచి జరుగుతున్న అండర్-19 స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి బాల, బాలికల ఫెన్సింగ్ పోటీలు గురువారంతో ముగిశాయి. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. డీఈవో జనార్దన్‌రెడ్డి, డీఎస్‌డీఓ రాజు, ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్, కర్నూలు జిల్లా అండర్-19ఎస్జీఎఫ్ కార్యదర్శి హర్షవర్ధన్, నంద్యాల జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి శ్రీనాథ్ విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎస్జీఎఫ్ కార్యదర్శులు మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభ చూపినవారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశామని, జాతీయ స్థాయిలో జరిగే అండర్-19 ఫెన్సింగ్ పోటీలు బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో డిసెంబర్ 17నుంచి 21వరకు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అబ్జర్వర్ భవాని, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏపీరెడ్డి, నాగేంద్ర, నాగరాజు, విశ్వనాథ్, ఫెన్సింగ్ కోచ్ తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు: డీఈవో



తిమ్మాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో డీఈఓ జనార్దన్‌రెడ్డి

మహానంది, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పది విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం మహానంది మండలం ఎం.తిమ్మాపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ప్రయోగశాలను పరిశీలించారు. విద్యార్థులకు పంపిణీ చేసే గుడ్లు, చెక్కీలను పరిశీలించారు. పదిలో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ గురించి ఉపాధ్యాయులతో చర్చించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలతో పాటు బోధన అంశాలపై విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో రామసుబ్బయ్య పాల్గొన్నారు.

చీడ పీడల నియంత్రణకు ప్రత్యేక యాప్

- రైతులంతా వినియోగించాలి: జేడీ వరలక్ష్మి



మాట్లాడుతున్న జేడీ వరలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంటలపై వ్యాపించే తెగుళ్లు, క్రిమికీటకాల నివారణకు కేంద్ర ప్రభుత్వం ఒక మొబైల్ యాప్‌ను రూపొందించిందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి గురువారం తెలిపారు. ఈ యాప్‌ను ఎలా వాడాలనే దానిపై అవగాహన కల్పించడానికి గురువారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కాన్ఫరెన్స్ హాల్లో కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి హాజరైన రైతులకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ వరలక్ష్మి మాట్లాడుతూ జాతీయ చీడపీడల పర్యవేక్షణ వ్యవస్థను ఏ విధంగా మానిటరింగ్ చేయాలో వివరించారు. ఈ సమావేశానికి సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ విజయవాడ నుంచి కే. వీరయ్య చౌదరి, సురేష్ కాంబ్లీ నియంత్రణాధికారులు,రెండు జిల్లాల నుంచి 20 మంది ఆదర్శ రైతులు, 14 మంది వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



శ్రీమఠం హుండీ లెక్కింపు పూర్తి

- ఆదాయం రూ.3.92 కోట్లు

మంత్రాలయం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం గురువారం లెక్కింపు పూర్తయినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్ తెలిపారు. బుధవారం నుంచి హుండీ లెక్కింపు చేపట్టగా.. గురువారంతో ముగిసింది. 31 రోజులకు గాను రూ.3,92,58,940 నగదుతో పాటు 74.500 గ్రాముల బంగారు, 1.270 కేజీల వెండితో పాటు వివిధ దేశాల కరెన్సీ వచ్చినట్లు వారు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో సూపరింటెండెంట్లు అనంతపురాణిక్, జేపీ స్వామి, రవికులకర్ణి, సుజ్ఞానేంద్ర, దేశాయ్ నరసింహస్వామి, శ్రీపాదాచార్ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన కుడా చైర్మన్ సోమిశెట్టి

కర్నూలు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి మర్యాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు కుడా చైర్మన్ పదవి అవకాశం కల్పించినందుకు సీఎంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు కలిసిన వారిలో తెలుగు యువత రాష్ట్ర నాయకుడు సోమిశెట్టి నవీన్ ఉన్నారు.



సీఎంను కలిసిన కుడా చైర్మన్


మాట్లాడుతున్న కర్నూలు కలెక్టర్ పి.రంజిత్ బాషా

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ప్రభుత్వ ఎయిడెడ్ ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్మీడియట్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపుపై ప్రభుత్వ ఎయిడెడ్ ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపాల్‌తో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 50 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత సాధించాయన్నారు. పత్తికొండ, కోసిగి, ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 30 శాతం ఉత్తీర్ణత సాధించాయని, వంద శాతం పురోగతి సాధించాలని ఆదేశించారు.

ఇదేనా స్వచ్ఛ సంకల్పం?

చెత్తను తరలించాల్సిన వాహనాలు పనికిరాని వస్తువులకు తోడయ్యాయి. నెలల తరబడి మూలన ఉంచడంతో పరికరాలు తుప్పు పడుతున్నాయి. కోడుమూరు మండలంలో చెత్త సంపద కేంద్రంలో పదుల సంఖ్యలో కొత్త ట్రైసైకిళ్లు (రిక్షాలు) ఉన్నాయి. దాదాపు ఏడాదిగా వినియోగం చేయకపోవడంతో ఇవన్నీ మూలనపడి తుప్పు పడుతున్నాయి. ఆదాయం, ఆరోగ్యం, ఆహ్లాదం లక్ష్యంగా చెత్త సంపద కేంద్రాలను ఉపాధి హామీ పథకం నిధులతో ప్రభుత్వం నెలకొల్పింది. అందుకు గ్రామ జనాభాను బట్టి గ్రీన్ అంబాసిడర్లను నియమించింది. వీరి ద్వారా తడి, పొడి చెత్త, వ్యర్థాలు సేకరించి సంపద కేంద్రాలకు తరలించడం జరుగుతుంది. ఇందుకు ట్రాక్టర్, ట్రైసైకిళ్లు, బ్యాటరీ ఆటోలు కేటాయించింది. చెత్త సంపద కేంద్రంలో వర్మీకంపోస్టు తయారీ, ప్లాస్టిక్ వ్యర్థాలు వేరు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. తద్వారా గ్రామాలు శుభ్రపడి ఆదాయం వస్తుంది. అయితే వాహనాలను నెలల తరబడి వినియోగించకుండా మూలన ఉంచితే చెత్తలో కలిసిపోవడం ఖాయం.

- కోడుమూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)


కోడుమూరు పంచాయతీ కార్యాలయంలో మూలనపడ్డ రిక్షాలు

నారా రామ్మూర్తి నాయుడికి బీసీ నివాళి


నారావారిపల్లెలో సహచర మంత్రులతో బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడుకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నివాళులర్పించారు. నారావారిపల్లెలో గురువారం జరిగిన రామ్మూర్తి నాయుడు దినకర్మ కార్యక్రమానికి మంత్రి బీసీ హాజరయ్యారు. ఈ సందర్భంగా సహచర మంత్రులతో కలసి నివాళులర్పించారు.

ఆర్మీ ఉద్యోగి భార్య అనుమానాస్పద మృతి

- తమ్మడ పల్లిలో ఉద్రిక్తత
- పోలీసుల జోక్యంతో అంత్యక్రియలు

మహానంది, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మడపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి వెంకట క్రిష్ణకు నంద్యాల సాధిక్ నగర్‌కు చెందిన అనూషకు మూడు సంవత్సరాల క్రితం వివాహ మైంది. వెంకటక్రిష్ణకు వారణాసిలోని మిలటరీ క్యాంప్‌కు బదిలీ కావడంతో భార్యతో సహా అక్కడికి వెళ్లిపోయాడు. వీరికి రిత్విక్ శ్యాంబాబు అనే కుమా రుడు ఉన్నాడు. ఈనెల 23న అనూష(23) వారణాసిలో మృతి చెందింది. విషయాన్ని భర్త మృతురాలి తల్లితండ్రులకు తెలిపాడు. వారు వారణాసి చేరుకొని మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయ్యాక మృతదేహంతో పాటు 11 నెలల రిత్విక్ శ్యామ్‌తో గురువారం మహానంది మండలం తమ్మడపల్లి లోని వెంకటక్రిష్ణ ఇంటి ముం దుకు చేరుకున్నారు. అయితే ఇది అనుమానాస్పద మృతి అని వారు వెంకటక్రిష్ణ ఇంటి ముందు ధర్నా చేయడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఆ సమయంలో వెంకటక్రిష్ణ తల్లితం డ్రులు ఇంట్లో లేరు. తమ మనవడికైనా న్యాయం చేయాలని అనూష తల్లిదండ్రులు గ్రామంలోని పెద్ద మనుషులను ఆశ్రయించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సర్దుబాటు చేశారు.


అనూష(ఫైల్)

యువకుడి ఆత్మహత్య

కర్నూలు క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్స్‌లో నష్టపోయి కేసీ కెనాల్‌లో దూకి అనిల్‌బాబు (31) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అశోక్‌నగర్‌కు చెందిన అనిల్ బాబు కడపలో ఓ సినిమా టాకీసులో పాప్‌కార్న్ అమ్ముతూ జీవిస్తు న్నాడు. కొద్ది కాలంగా ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడ్డాడు. తన తల్లి సుజాత నుంచి రూ.20వేలు ఫోన్‌పే చేయించుకున్నాడు. ఈ నెల 21న ఇంటికి వచ్చి ఇంట్లో బ్యాగ్, సెల్‌పోన్ ఉంచి బయటకు వెళ్లిపోయాడు. ఆ తర్వాత కనిపించలేదు. గురువారం కేసీ కెనాల్‌లోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించి మార్చ్యురీకి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషయ్య తెలిపారు.

బాధితులకు న్యాయం చేయాలి

- నేర సమీక్షలో ఎస్పీ జి.బిందుమాధవ్

కర్నూలు క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రాపర్టీ కేసులు, సైబర్ నేరాల కేసుల్లో బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. గురువారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లా లోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐ లతో ఎస్పీ నేర సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల 2022-23, 24 సంవత్సరాల వారీగా చాలా కాలంగా ఉన్న పెండింగ్ కేసులను అడిగి తెలుసుకున్నారు. ప్రాపర్టీ కేసుల్లో రికవరీ శాతం పెంచాలన్నారు. యుఐ కేసులు తగ్గించాల న్నారు. పోక్సో కేసులు, పెండింగ్ ట్రయల్ కేసుల్లో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో మాట్లాడి నిందితులకు శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో కాంపౌండబుల్ కేసులు తగ్గించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్డు ప్రమాదంలో బాధితులకు తగిన నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, ఈ-చలానాలు రికవరీ చేయాలని ఆదేశించారు. సైబర్ చీటింగ్ కేసుల్లో బాధితులు మోసపోయిన నష్టాన్ని, బ్యాంకుల్లో ఫ్రీజ్ చేయించిన ఆ మొత్తాన్ని కోర్టు అనుమతితో బాధితులకు అందజే యాలని అన్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే 1930కి వెంటనే ఫిర్యాదు చేసేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చందనబ్రదర్స్‌లో చోరీ కేసును ఛేదించిన టూటౌన్ సీఐ నాగరాజురావు, కానిస్టేబుల్స్ రాజు, రవీంద్ర, మహేంద్ర, మల్లికార్జునలను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.హుశేన్ పీరా, ఏఆర్ అడిషినల్ ఎస్పీ కృష్ణమోహన్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు, ట్రైనీ డీఎస్పీ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సీఐని అభినందిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

ఉపాధిలో అవినీతికి జైలే

- జీవో నెం.52 మరింత కఠినంగా అమలు చేయాలని నిర్ణయం
- విజిలెన్స్ విభాగానికి జవసత్వాలు


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ఏ పార్టీ అధికారంలో ఉంటే.. ఆ పార్టీ నాయకులకు జేబులు నింపే కల్పతరువు అనే విమర్శలు తరచూ వినిపిస్తూ ఉం టాయి. ఇలాంటి అక్రమా లకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ఇప్ప టికే ఉన్న జీవో.నెం.52కు పదును పెట్టాలని నిర్ణయించింది. ఈ స్కీంలో అక్రమాలను నిరోధిం చే విజిలెన్స్ విభాగాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. మళ్లీ ఆ విభాగానికి పూర్తిస్థాయిలో జవసత్వాలు కల్పిం చేందుకు విజిలెన్స్ విభాగాన్ని పటిష్టం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న సిబ్బందిలో జవాబుదారీతనాన్ని పెంచే ప్రయత్నంలో భాగంగా చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా వివిధ విభాగాలకు చెం దిన అధికారులను కాకుండా పోలీసు అధికారిని నియమించడంతో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది ఈ పథకం ద్వారా జేబులు నింపుకుంటున్న నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కొత్తగా విజిలెన్స్ విభాగం అధికారిగా బాధ్యతలు తీసుకున్న చీఫ్ విజిలెన్స్ అధికారి భవానీ హర్ష నిమా విభాగాన్ని పటిష్టం చేసేందుకు చర్యలు ప్రారంభించారని ఉమ్మడి కర్నూలు జిల్లా డ్వామా అధికారులు తెలిపారు. విజిలెన్స్ విభాగం అసలు లక్ష్యాలను సాధించేం దుకు చీఫ్ విజిలెన్స్ అధికారి భవానీ హర్ష అన్ని జిల్లాల్లో ఉపాధి హామీ పథకంలో జరిగిన, జరుగు తున్న పనుల వివరాలపై నివేదిక అందించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఉపాధి పథకంలో జరిగిన పనులపై ఇప్పటి దాకా సోషల్ ఆడిట్ విభాగం తనిఖీలు చేసి రికవరీ వసూలు చేసే అతి స్వల్ప పాత్రను మాత్రమే పోషిస్తోంది. ఇకపై విజిలెన్స్ విభాగం సోషల్ ఆడిట్‌ను ఆషా మాషీగా తీసుకోకుండా ఎన్ని పనులు చేప ట్టారు..? సక్రమంగా ఏ ఏ పనులు జరగాయి.. ఆ పనుల్లో ఎంత అవినీతి జరిగింది? అనేవి పరిశీలించి దుర్వినియోగమైన ప్రతి రూపాయిని అక్రమార్కుల నుంచి వసూలు చేసేందుకు విజిలెన్స్ విభాగం ముందుకు వెళ్లే అవకాశం ఉంది.



జీవో.నెం.52 ప్రకారం ఉపాధి హామీ పథకంలో రూ.లక్ష కంటే ఎక్కువ మొత్తంలో అవినీతి పాడినట్లు సోషల్ ఆడిట్‌లో నిర్ధారణైతే.. విచారణ చేయాలని డ్వామా అధికార వర్గాలు తెలిపాయి. ఆ జీవోను ఇప్పటి వరకు తుతూ మంత్రంగా అమలు చేశారు. కొత్తగా చీఫ్ విజిలెన్స్ అధికారి ఈ జీవోలో నిబంధనలపై దృష్టి పెట్టినట్లు డ్వామా పీడీ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు ఆయా జిల్లాలో ఎంత మంది రూ.లక్ష కంటే ఎక్కువగా అవినీతికి పాల్పడినట్లు సోషల్ అధికారులు నిర్ధారించిందీ తెలుసుకొని వారిపై కేసులు నమో దు చేశారా? చేయకపోతే ఎందుక చేయలేదు? అందుకు కారణాలే మిటి? అనే వివరాలను అందించాలని ఆయా జిల్లాల విజిలెన్స్ అధికారులు పాల్గొంటున్నట్లు డ్వామా అధికార వర్గాలు తెలిపాయి. దీంతో పాటు అక్రమాలకు పాల్పడిన వారిపై ఆధార్ యాక్టు ఎన్నిచోట్ల వినియోగించారు? పరారీలో ఉన్న అక్రమార్కుల వివ రాలు.. అక్రమాలకు పాల్పడటంతో తొలగిం చబడిన సిబ్బంది వివరాలను పంపించాలని సర్క్యులర్‌లలో తప్పులు బైటపడ్డాయి. దీంతో తప్పుచేసిన వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇకపై ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అవకాశం ఉండదని పూర్తి స్థాయిలో అవినీతిని నిర్మూలించవచ్చని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. సోషల్ ఆడిట్‌లో తేలిన తప్పులపై మూడు రోజుల్లోపు చర్యలు తీసుకోవాలని జీవో.52లో స్పష్టంగా పేర్కొంది. ఈ నేపథ్యంలో విజిలెన్స్ ప్రొసీడింగ్‌ను ఖచ్చితంగా అమలు చేసేందుకు పీడీ అధికారులు సమాయత్తం అవుతున్నారు. కంచె చేను మేసినట్లుగా అక్రమార్కుల భరతం పట్టాల్సిన అధికారులు సోషల్ ఆడిట్ విభాగం గతంలో కొన్ని చోట్ల కమిషన్లు వసూలు చేయడంపైన దృష్టి పెట్టారు. దీంతో పాటు అంబుడ్స్‌మెన్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలకు కూడా పదును పెట్టే యోచనలో ఆ ప్రాజెక్టు అధికారులు దృష్టి పెట్టారు. ఏది ఏమైనా విజిలెన్స్ విభాగాన్ని కఠిన తరం చేస్తే ఇకపై ఉపాధి పథకంలో అవినీతికి పాల్పడిన వారు జైలుకు వెళ్లక తప్పదేమోనన్న భయం ఆ విభాగంలో పని చేస్తున్న వారిలో, రాజకీయ నాయకుల్లో కనిపిస్తున్నది.

జీవో నెం.52ను కచ్చితంగా అమలు చేస్తాం



ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు, అవినీతికి తావు లేకుండా విజిలెన్స్ విభాగాన్ని పటిష్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. చీఫ్ విజిలెన్స్ విభాగం అధికారి నుంచి జరిగిన పనులు, సోషల్ ఆడిట్‌లో తేల్చిన రికవరీ మొత్తాలపై వివరాలు అడుగుతూ ఉత్తర్వులు పంపారు. రానున్న రోజుల్లో ఉపాధి హామీ పథకం పూర్తి స్థాయిలో రైతులకు, రైతు కూలీలకు సక్రమంగా వినియోగించే అవకాశం ఉంది.

- వెంకటసుబ్బయ్య, డ్వామా పీడీ

ఆర్‌యూ ఘటనపై సీఎంవో ఆరా..!

- చర్చగా మారిన ప్రిన్సిపాల్‌పై దాడి ఘటన
- ఉప కులపతిని వివరణ కోరిన సీఎంవో ఓఎస్డీ



కర్నూలు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ ఘటనపై సీఎంవో కార్యాలయం స్పందించినట్లు తెలుస్తోంది. రాయలసీమ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డిపై జరిగిన దాడిపై ఆరా తీసినట్లు సమాచారం. రాయలసీమ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డిపై బుధవారం సాయంత్రం కొందరు విద్యార్థులు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డిపై బూతులతో రెచ్చిపోయి దాడికి పూనుకున్నారు. దీంతో ఆయన ఎస్పీని కలిసి తనకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు. అలాగే మంగళవారం రిజిస్ట్రార్ కారు డ్రైవర్‌ను కూడా ఓ విద్యార్థి నాయకుడు చితక బాదారు. మరోవైపు నాన్‌టీచింగ్ టైం స్కేల్ ఉద్యోగి వర్సిటీ విధులకు హాజరు సమయంలో దారి కాచి దాడి చేయాలని వ్యూహం పన్నారు. ఈ విషయం తెలిసి సదరు ఉద్యోగి కొందరు ఉద్యోగుల సహాయంతో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డిని ఆశ్రయించారు. వెంటనే ఎమ్మెల్యే జోక్యం చేసుకొని ఉన్నతాధికారిని మందలించినట్లు తెలిసింది. అయితే పథకం ప్రకారం క్యాంపస్‌లో దాడులు జరుగుతున్నాయని కొందరు విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

ప్రిన్సిపాల్‌పై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ఓ ఉన్నతాధికారి విద్యార్థులతో దాడులు చేయిస్తున్నారని కొందరు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. వరుస వివాదాలపై ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లడంతో సీఎంవో ఓఎస్డీ వరప్రసాద్ ఉపకులపతిని వివరణ కోరినట్లు సమాచారం. విషయంపై వర్సిటీ రిజిస్ట్రార్ బోయ విజయకుమార్‌ను వివరణ కోరగా ప్రిన్సిపాల్‌తో విద్యార్థి నాయకుల వాగ్వివాదం వాస్తవ మేనని, దాడులు జరగలేదని అన్నారు. ఎస్పీని కలిసి తనకు విద్యార్థుల నుంచి రక్షణ కల్పించాలని ప్రిన్సిపాల్ ఆశ్రయించారని తెలిపారు. ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసినా స్పందించలేదని అన్నారు. 'నిన్ను నేను ఎన్ని సార్లు కాపాడాలి, నీవే సమస్యను పరిష్కరించుకోవాలని ఫోన్ కట్ చేశారని' పేర్కొన్నారు. విద్యార్థి నాయకుడు బూతులతో రెచ్చిపోవడం దారుణమని, ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

సాహితీ దిగ్గజం వెంకటసుబ్బయ్య కన్నుమూత



కర్నూలు కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, చారిత్రక, పురాణాల పుస్తకాల రచయిత, వక్త డాక్టర్ అప్పాజోడు వెంకట సుబ్బయ్య (90) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కోలుకోలేక బుధవారం కర్నూలు అశోక్‌నగర్‌లోని ఆయన స్వగృహంలో కన్ను మూశారు. గురువారం ఆయన అంత్యక్రియలు కర్నూలులో నిర్వహించారు. ఆయనకు లలిత కుమారి, శ్రీవల్లి ఇద్దరు సంతానం. ఆయన భార్య సరోజనీదేవి ఇటీవలే కన్నుమూశారు. 1935 మార్చి 21న జన్మించిన వెంకట సుబ్బయ్య హైదరాబాదు ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి 'మహా భరతము - మానవ స్వభావచిత్రణ' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించి డాక్టరేట్ పొందారు. తెలుగు అధ్యాపకుడిగా, ఆంధ్రశాఖాధ్యక్షులుగా అనంతపురం, గూడూరు, హైదరాబాదు, నంద్యాలలో పని చేశారు. కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాలల్లో ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధ్యాపకునిగా 1983లో, కళాశాల ప్రిన్సిపాల్‌గా 1988లో ఉత్తమ అధ్యాపక పురస్కారాలు అందుకున్నారు. అలాగే సాహిత్య విమర్శ కునిగా తెలుగు విశ్వ విద్యాలయం నుంచి 2008లో విశేష పురస్కారం అందుకున్నారు. వ్యాస మంజరి, షట్పది, జీవన చిత్రాలు (రామాయణ పాత్రలు), టీటీడీ ప్రచురించిన ఆంధ్ర మహాభారతము ఆదిపర్వం 5, 6, 7, 8 అశ్వాలకు, సభా పర్వానికి సమగ్ర వ్యాఖ్య రాశారు. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్‌లో కార్యదర్శిగా సేవలు అందించారు. అలాగే టీటీడీ ముద్రణాలయం తలపెట్టిన పౌరా ణిక, ఇతిహాస గ్రంథాల పునర్ముద్రణలో భాషా వేత్తగా తనదైన సేవలు అందించారు. ఆయన మృతికి టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సామాజికవేత్త కేసీ కల్కూర, మధురకవి ఎలమర్తి రమణయ్య, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు కా.వెం.సుబ్బలక్ష్మమ్మ, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, జేఎస్ఆర్‌కే శర్మ నివాళి ప్రకటించారు.

యువకుడి ఆత్మహత్య

బేతంచెర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన షేక్ టర్కి మహ్మద్ రఫీ కుమారుడు షేక్ టర్కీ హిమయత్ (37) గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు నాపరాళ్ల వ్యాపారంతో నష్టపోయాడు. దీనికితోడు ఆయన భార్య ఏడాది క్రితం మృతి చెందింది. దీంతో ఈ నెల 25న అదృశ్యమయ్యాడు. హిమయత్‌ని ఇంటికి తీసుకుని రాగా, రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపారు.



కేఎంసీ క్యాంటీన్ పునఃప్రారంభం



కర్నూలు హాస్పిటల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత 9 నెలలుగా మూతపడ్డ కర్నూలు మెడికల్ కాలేజీ క్యాంటీన్ గురువారం ఉదయం పునఃప్రారంభమైంది. కొందరు సిబ్బంది అక్కడ పారిశుధ్య పనులు చేపట్టారు. 2014లో ప్రారంభమైన క్యాంటీన్ ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు లీజుకు తీసుకుని ఓ ప్రైవేటు వ్యక్తికి కట్టబెట్టారు. భవనాన్ని పూర్తి చేసి క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఆసుపత్రిలో క్యాంటీన్ ఉండటం వల్ల వేళకు డాక్టర్లు, జూనియర్ డాక్టర్లు భోజనం చేసే సదుపాయం ఉండేది కానీ, 9 నెలల క్రితం క్యాంటీన్ మూత పడింది. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా అసోసియేషన్ నాయకుల ద్వారా తెలిసిందని తెలిపారు.

శిక్షణా తరగతులను రద్దు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను రద్దు చేయాలని డీటీఎఫ్ జిల్లా శాఖ గురువారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజపతి నగరం బాలాజీ పాలిటెక్నిక్ కళా శాలలో ఉపాధ్యాయ శిక్షణా తరగతులలో శ్రీనివాసరావు అనే ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందడంతో డీటీఎఫ్ ప్రగాఢ సంతాపం తెలియజేసింది. ఈసందర్భంగా డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్రాముడు, గట్టు తిమ్మప్ప మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలన్నీ శిక్షణ తరగతులపై సూచనలు చేసినా మార్పులు చేయక పోవడం శోచనీయమన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ చాంబరులో గురువారం ఆహారం, పోషణ భద్రత పథకం కింద కంది పంట ఆశించు చీడపీడలు, శనగ పంట సాగు పద్ధతుల కరపత్రాలను కలెక్టర్ రంజిత్ బాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

కర్నూలు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామక్రిష్ణుడులు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కే మహేష్ గౌడ్, నాగరాజు యాదవ్, జే.తిరుపాల్ బాబు, విజయ్ కుమార్, బేతం క్రిష్ణుడు, సోమిశెట్టి నవీన్, దరూర్ జేమ్స్, షేక్షావలి పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయంలో: జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, సిటీ అధ్యక్షుడు షేక్ జీలానీ బాషా, పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధకృష్ణ, బీ. బతుకన్న పాల్గొన్నారు.

● **ఆర్‌యూలో..** రాయలసీమ యూనివర్సిటీలో జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్ర మంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహులు, ప్రొఫెసర్లు సుందరానంద పుచ్చా, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: భారత సాంఘిక విప్లవ పితామహుడు మహాత్మాజ్యోతి రావు పూలే అని 46వ వార్డు సీనియర్ నాయకుడు నౌషాద్ అన్నారు. గురువారం పూలే వర్ధంతి సందర్భంగా విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాము, భరత్, ఖాజావలి, అనిల్ పాల్గొన్నారు.

● ఏపీ రజకవృత్తిదారుల సంఘం న్యూసిటీ కమిటీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. వీరనారి ఐలమ్మ కార్యాలయంలో పూలే చిత్రపటానికి జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ పూల మాల వేసి నివాళి అర్పించారు. రాముడు, శేషాద్రి, మద్దిలేటి పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయంలో పూలేకు నివాళి అర్పిస్తున్న నాయకులు



కాంగ్రెస్ కార్యాలయంలో..



రాయలసీమ విశ్వవిద్యాలయంలో..

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

జ్యోతిరావు పూలే వర్ధంతిలో మాజీ ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తుందని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాట సాని రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. గురువారం కల్లూరు అర్బన్ 29వ వార్డులో జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కాటసాని, మేయర్ బీవై రామయ్య పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విలేకరులతో కాటసాని మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం వాగ్దానాలను అమలు చేయకుండా వైసీపీ నాయకులే టార్గెట్ చేసుకొని రెడ్‌బుక్ పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎస్. రేణుక, కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, దండు లక్ష్మీకాంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

● 33వ వార్డు పెద్దమ్మ ఆలయం సమీపంలోని నాగులకట్ట వద్ద గురువారం రావి చెట్టు, వేపచెట్టుకు కల్యాణంనిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. కార్యక్ర మంలో కార్పొరేటర్ నరసింహులు పాల్గొన్నారు.

గీతా సంఘం కృషి ప్రశంసనీయం

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీజీ వెంకటేశ్ తదితరులు

కర్నూలు కల్చరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ధార్మిక భావనల వ్యాప్తికి కర్నూలు గీతా ప్రచార సంఘం చేస్తున్న కృషి ప్రశంసనీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. గురువారం నగరంలోని సంకల్‌బాగ్‌లో హరిహర క్షేత్రం సమీపంలోని గీతా ప్రచార ధామం సమావేశ హాలులో డిసెంబరు 11న నిర్వహిస్తున్న 'భగవద్గీత సహస్ర గళ పారాయణం' కార్యక్రమ వివరాలు తెలియజేసే కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ గీతా జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుత సమాజానికి ధార్మిక బోధనలు ఎంతో అవస రమన్నారు. గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డీవీ రమణ మాట్లాడుతూ భగవద్గీత ప్రతి ఒక్కరి నిత్య జీవితంలో భాగం కావాలన్నారు. సహస్ర గళ పారాయణంలో మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌తో పాటూ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, హైదరాబాదుకు చెందిన ప్రముఖ ఆధ్యా త్మికవేత్త వీఎస్ఆర్ మూర్తి, చిన్మయ మిషన్ మాతాజీ సుప్రేమానంద సరస్వతి, దత్తపీఠం ప్రతినిధి కె. నాగజ్యోతిలు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో గీతా ప్రచార సంఘం కార్యదర్శి ఎస్ జగన్నాథగుప్త, దత్తపీఠం ప్రతినిధి టి.రామకృష్ణ, నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్, మేడం అభిజిత్, ఎస్ రమేష్, మల్లికార్జున, మహాబలేష్, నాగోజీరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైభవంగా రామదాసు రథోత్సవం



రథోత్సవానికి హాజరైన భక్తులు

కోడుమూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరిలో రామదాసుస్వామి రథోత్సవం గురువారం సాయంత్రం వైభవంగా జరిగింది. వార్షిక తిరుణాలను పురస్కరించుకుని రథోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం పంచామృతాభిషేకం, ఆకుపూజ, పుష్పార్చనలు నిర్వహించారు. సాయంత్రం మేళతాళాల మధ్య ఉత్సవమూర్తిని పల్లకిలో తోడ్కొని వచ్చి రథంపై కొలువుదీర్చారు. రథానికి గుమ్మడి, టెంకాయలు కొట్టి సాత్విక బలిదానం చేశారు. రామదాసుస్వామి నామ స్మరణ చేస్తూ రథాన్ని స్మారకమందిరం వరకు లాగారు. అక్కడ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తిరిగి అదేమార్గంలో రథాన్ని ఆల యం వద్దకు చేర్చారు. ఈ వేడుకను తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

● **ఆలయంలో కోట్ల పూజలు:** రామదాసుస్వామి తిరుణాలను పురస్కరించుకుని ఆలయంలో ఉదయం డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజారులు ఆయనను ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. పూజారులు కోట్లకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చిత్తూరు డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో జరిగే 39వ యూత్ జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు కర్నూలు క్రీడాకారుడు జశ్వంత్ రెడ్డి ఎంపికైనట్లు రాష్ట్ర బాస్కెట్‌బాల్ ప్రధాన కార్యదర్శి చక్రవర్తి, సంఘం ప్రతినిధి దాదాబాషా గురువారం తెలిపారు. కర్నూలు జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్ష , కార్యదర్శులు, అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కత్తా నగరంలో ఈ నెల 29 నుంచి డిసెంబరు 4 వరకు జరిగే 39వ యూత్ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో జశ్వంత్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

రేపు షూటింగ్‌బాల్ జట్ల ఎంపికలు: స్థానిక డీఎస్ఏ క్రీడా మైదానంలో బాలికల జిల్లా షూటింగ్ బాల్ జట్టు ఎంపిక పోటీలు శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులతో పాటు క్రీడానైపుణ్యం కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు గురువారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

గూడూరు నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని పార్టీ సీనియర్ నాయకుడు, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు అన్నారు. గురువారం గూడూరు లోని పదో వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రేమట వెంకటేష్, డాక్టర్ మన్నన్ బాషా, రహిమాన్, పుట్టపాశం రామాంజనేయులు పాల్గొన్నారు.

● టీడీపీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలందరికీ ప్రమాద బీమా కింద ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తుందని మండల టీడీపీ అధ్యక్షుడు జె సురేష్ అన్నారు. గురువారం గూడూరు మండలంలోని ఆర్ కానాపురం గ్రామంలో జె సురేష్ అధ్యక్షతన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్‌బాబు, సర్పంచ్ మునిస్వామి, మన్యంకొండ, నరసింహ పాల్గొన్నారు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీడీపీ నాయకులు

లో ఓల్టేజీ సమస్యకు చెక్

శరీన్‌నగర్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శరీన్‌నగర్ సమీప కాలనీల్లో లోఓల్టేజీ, ఓవర్‌లోడ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఉమాపతి తెలిపారు. గురువారం కర్నూలు టౌన్ డీఈ టి.శేషాద్రితో కలిసి ఎస్ఈ శరీన్‌నగర్‌లో అదనంగా 5 వేల కేవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. నగరంలో తరుచూ లోఓల్టేజీ , ఓవర్‌లోడ్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రానున్న వేసవి దృష్ట్యా ప్రజలకు మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను రీచార్జ్ చేశామన్నారు.

కుక్కల దాడిలో 30 గొర్రెలు మృతి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం ఈ.తాండ్రపాడుకు చెందిన గొర్రెల కాపరి శ్రీనివాసులకు చెందిన 30 గొర్రెలు బుధవారం రాత్రి కుక్కల దాడిలో మృతి చెందాయి. గురువారం గొర్రెలకాపరిని ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల సహకార సం ఘం అధ్యక్షుడు కే.శ్రీనివాసులు పరామర్శించి, రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట జిల్లా కురువ సంఘం ఉపాధ్యక్షుడు ధనుంజయ వెంకట్రాముడు, తిరుమలేష్, మద్దిలేటి ఉన్నారు.

వాలీబాల్ క్రీడాకారులకు అభినందన

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సూర్యలంక బీచ్ బాపట్ల జిల్లాలో ఈనెల 26 నుంచి 27 వరకు జరిగిన అండర్-14, 17, 19 రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు కర్నూలు జిల్లా జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు అండర్-14 జట్టు రెండో స్థానం సాధించారు. అండర్-19 మూడో స్థానంతో విజయం కైవసం చేసుకుంది. జట్టుకు డీఎస్ఏ కోచ్‌లు రవి, రాజేష్‌లు వ్యవహరించారు. విజయాలతో తిరిగి వచ్చిన క్రీడాకారులను త్రీటౌన్ సీఐ నాగశేఖర్ అభినందించారు. కార్యక్రమంలో సిబ్బంది, కోచ్‌లు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. గురువారం తన స్వగృహంలో ఆమె పాణ్యం నియోజకవర్గంలో రూ.11,27,474 సీఎం సహాయనిధి చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలతో అల్లాడుతున్న కుటుంబాలను ఆదుకోని వారికి సీఎం సహాయ నిధులతో భరోసా కల్పిస్తున్నామన్నారు.

ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నగర పాలక పరిధిలోని 38, 40 వార్డు సచివాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి నిధుల తోపాటు ఇసుక, సిమెంటు, స్టీలు ఉచితంగా ఇవ్వాలన్నారు. అనంతరం సంబంధిత సచివాలయాల అడ్మిన్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గసభ్యులు నాగరాజు, రామచంద్ర, సోఫియా, ఆశాబేగం పాల్గొన్నారు.

పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలి: సీపీఐ

కల్లూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతంలో అర్హులైన పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్‌లోని 81, 82, 65, 63, 93, 97, 107, 108, 11, 34 సచివాలయాల్లో వీఆర్వోలకు వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లలో పేదలకు ఇంటిస్థలం మంజూరు చేసి, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలని అన్నారు. కార్యక్రమంలో అన్వర్, రామాం జనేయులు, మల్లికార్జున, అబ్రహాం, రేణుక, జానకి, మాణిక్యం, చక్రవర్తి పాల్గొన్నారు.

'బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష' విద్యార్థులకు వరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

కోడుమూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష పథకం విద్యార్థులకు వరం అని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్ మాదన్న అన్నారు. స్థానిక జీవీఆర్ బాలుర ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉచిత వైద్య పరీ క్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉచిత స్క్రీనింగ్, ఎత్తు, బరువు, ఛాతి కొలత, హిమోగ్లోబిన్, బీపీ, మధుమేహం వంటి పరీక్షలు చేస్తామన్నారు. అలాగే పుట్టుకతో వచ్చే 4డీ లోపాలు, పౌష్టికాహార లోపాలు, తరచు వచ్చే రోగాలు, వయస్సుకు తగ్గ శారీరక, మానసిక పెరుగుదల, అంగవైకల్య లక్షణాలు గుర్తించి అవస రమైన చికిత్సను అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నరసప్ప, కమాల్‌సాహెబ్, ఉమాబాయి, ప్రధానోపాధ్యాయుడు తైమూరుబాషా పాల్గొన్నారు.

'జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి రాదు'

కర్నూలు హాస్పిటల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎఫ్ఎన్‌వో(ఫీమెల్ నర్సింగ్ ఆర్డర్లీ) నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి రాదని డీఎంహెచ్‌వో ఎల్.భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 ఫిబ్రవరి 16న పార్వతి అనే ఎఫ్ఎన్‌వో పదోన్నతి కోసం దరఖాస్తు పెట్టుకుందని, దీన్ని డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు పంపించామని, ఈ పదోన్నతి జిల్లా పరిధిలోని పోస్టు కాబట్టి జిల్లా వైద్యఆరోగ్యశాఖలోనే పరిష్కరించు కోవాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎంహెచ్‌వో వెల్లడించారు. డబ్బులు, నగల గురించి డీఎంహెచ్‌వో, డీఐవో విచారణ చేశామని, ఇది నిరాధారమైన ఆరోపణలని, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని మానసికంగా ఇబ్బందులకు గురి చేశారని సర్వీస్ రూల్స్ ప్రకారం పదోన్నతి రాదని వివరించారు. ఈ విషయాన్ని కలెక్టర్, డీఆర్వో దృష్టికి తీసుకెళ్లామన్నారు.

శ్రీరాంభొట్ల ఆలయంలో ధన్వంతరి హోమం

కర్నూలు కల్చరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ధన్వంతరి మహర్షి జయంతి వారోత్సవాల్లో భాగంగా గురువారం పాతనగరంలోని శ్రీరాం భొట్ల ఆలయంలో ధన్వంతరి హోమం నిర్వహించారు. ఆరోగ్య భారతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో శాస్త్ర పండి తుడు మామిళ్లపల్లి రాజేశ్ శర్మ శాస్త్రోక్తంగా హోమం నిర్వహించారు. 150 మంది ఆరోగ్య భారతి కార్యకర్తలు, పది మంది దంపతులు ఈ హోమాల్లో పాల్గొన్నారు. విశ్రాంత జిల్లా ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ టి. చంద్రశేఖర్, డాక్టర్ జగన్మోహన్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. యోగా గురువు అనురాధ ఆధ్వర్యంలో పిల్లలకు యోగ ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో ఆరోగ్యభారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి. మోక్షేశ్వరుడు, జిల్లా కార్యదర్శి బి. సత్యనారాయణ రెడ్డి, ఆరోగ్యభారతి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎండీవీఎన్ రామశర్మ, ఉపాధ్యక్షుడు డాక్టర్ ద్వారం ప్రభాకరరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి కాసుల స్వప్నపార్థసారధి, శేఖర్ గుప్త, బిలకంటి మురళీధర్, ఆరోగ్య భారతి ఆరోగ్య మిత్రులు పాల్గొన్నారు.



ధన్వంతరి హోమం చేస్తున్న భక్తులు

ఉప్పునీరే గతి

- పెద్ద హుల్తిలో మంచినీటి కష్టాలు
- రూ. అరకోటికిపైగా వెచ్చించిన నీటి పథకాన్ని ప్రారంభించిన కొళాయిలకు ఉప్పు నీటి సరఫరా



నూతనంగా నిర్మించిన ట్యాంకు



తాగునీటి కోసం ఒకే కొళాయి వద్ద బారులు

పత్తికొండ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దహుల్తి గ్రామంలో 442 కుటుంబాలు ఉండగా, 1,800 పైగా జనాబా ఉన్నారు. రూ.65లక్షలు వెచ్చించి గ్రామానికి 3 కి..మీ దూరంలోని ఆదోని-పత్తికొండ రోడ్డులో బోరు వేసి, అక్కడి నుంచి పైపులైన్ ద్వారా గ్రామంలో నిర్మించిన ట్యాంకుకు అనుసంధానం చేశారు. ట్యాంకు సామర్థ్యం 60వేల లీటర్లు కాగా ట్యాంకునుంచి గ్రామంలోని 462 కొళాయిలకు కనెక్షన్ ఇచ్చారు.

వారానికొకసారే తాగునీరు

గ్రామంలోని కొళాయిలకు వారానికోసారే తాగునీరు వస్తుందని ఇవి ఏమాత్రం సరిపోతాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు కావాలంటే ట్యాంకు దగ్గరకు వెళ్లి గంటలతరబడి వేచి చూడాల్సి వస్తోందని వాపోతున్నారు.

పనికిరాని స్థలంలో బోరు

వైసీపీ నాయకులు నిర్వాకంతో గ్రామంలో పెండ దిబ్బ వద్ద మరో బోరు వేశారు. ఆ బావిలోనుంచి ఉప్పునీరు వస్తోంది. ఇవి తాగడానికి పనికిరావడం లేదని, స్నానం చేస్తే చర్మంపై దురద వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

ఈ విషయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని విష్ణువర్ధన్‌రెడ్డిని వివరణ కోరగా పనులు మాత్రమే తమవని, నిర్వహణ పంచాయతీ వారే చూసుకోవాలని తెలిపారు. కాగా పంచాయతీ సెక్రటరీ హుసేన్ సాహెబ్ మాట్లాడుతూ తాను కొత్తగా వచ్చానని ఆర్‌డబ్ల్యూఎస్ వారితో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు.

ఉప్పు నీటితో చర్మవ్యాధులు



వారానికి ఒకసారి మాత్రమే అరగంట మాత్రమే తాగునీరు వస్తుంది. మిగతా రోజుల్లో ఉప్పు నీరు వస్తుంది. ఈ నీటితో స్నానం చేస్తే చర్మ వ్యాదులు వస్తున్నాయి. నీరు రంగుల మారి దుర్వాసన ఉంటుంది. **- నక్కల వరలక్ష్మి**

కోలుకోలేక రైతు మృతి

హోళగుంద, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘతానికి గురైన రైతు ఈడిగ విరుపాక్షి (49) కోలులేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గురువారం తెలిపారు. వివరాల మేరకు... నాయిబ్రాహ్మణ వీధికి చెందిన వీరుపాక్షి పొలంలో విద్యుదాఘాతానికి గురయ్యారు, బళ్లారిలోని ఓపీడీ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించినా కోలుకోలేక బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

మద్దికెర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నాయకుడు మెడికల్ తిమ్మప్ప, మాజీ ఉప సర్పంచ్ బసినేపల్లి తిమ్మప్ప, హరినాథ్‌గౌడ్ అన్నారు. గురువారం పెరవలి గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక మండలం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు నేతృత్వంలో మరింత అభివృద్ధి చెందుతోందన్నారు.

సామూహిక హోమాలు

వెల్దుర్తి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజరాజేశ్వరి ఆలయంలో కార్తీకమాసం త్రయోదశి హోమాలపే గురువారం సాయంత్రం 108 జంటలు నిర్వహిలంచారు. ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

పొలాలకు దారి చూపాలని వినతి

ఆదోని టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తమ పొలాలకు దారి చూపాలని రైతులు నారాయణప్ప, ఈరన్నగురువారం సబ్ లెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. టీజీఎల్ కాలనీ వద్ద ముస్లిం శ్మశానం, ఇద్గా వెనుక తమ పొలాలున్నాయని, కొందారు దారిని మూసివేశారన్నారు.

సభ్యత్వంతో కార్యకరల్తకు ప్రయోజనం



కురువల్లిలో సభ్యత్వ నమోదు చేస్తున్న వైకుంఠం శివప్రసాద్

ఆలూరు , నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వం తీసుకుంటే కార్యకర్తలకు ప్రయోజనం చేకూరుతుందని టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ అన్నారు. గురువారం రాత్రి ఆలూరు మండలం కురువల్లి గ్రామంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. సర్పంచ్ రవి, టీడీపీ నాయకులు నాగరాజు, కిషోర్, గోవింద్, ప్రకాశ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌తో డిజిటల్ సేవలు



పెండేకల్‌లో ఇంటింటి సర్వే చేస్తున్న సిబ్బంది

తుగ్గలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వే, ఆన్‌లైన్ చేస్తే పంచాయతీల్లో డిజిటల్ సేవలదుతాయనీ కార్యదర్శి గోపాల్ అన్నారు. గురువారం పెండేకల్‌లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటి పొడవు, వెడల్పు కొలతలను, నమూనాను జియో ట్యాగ్ చేస్తే ఆన్‌లైవలందుతాయన్నారు.

ఆలూరు అభివృద్ధిపై దృష్టి సారించాలి

- డిప్యూటీ సీఎంను కోరిన మాజీ మంత్రి మారెప్ప



డిప్యూటీ సీఎం పవన్‌తో మారెప్ప

ఆలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో అత్యంత వెనుకబడిన ఆలూరు అభివృద్ధిపై దృష్టి సారించాలని గురువారం ఢిల్లీలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలసి విన్నవించినట్లు మాజీ మంత్రి మారెప్ప తెలిపారు. ఏళ్లనుంచి తాగునీటి సమస్య తీరలేదని, రహదారులు అధ్వానంగా ఉన్నాయని, వలసలు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేదవతి, నగర దోణ ప్రాజెక్టులకు నిధులు ఇచ్చి రైతులను ఆదుకోవాలని పవన్ కళ్యాణ్‌ను కోరినట్లు తెలిపారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కుష్ఠు నిర్మూలనకు కృషి చేయాలి

ఆదోని రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా న్యూక్లియస్ వైద్యాధికారి మల్లికార్జున రెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం పట్టణం, రూరల్ పరిధిలోని హెల్త్ సెంటర్లను తనిఖీ చేశారు. క్షయ, కుష్ఠు ప్రారంభంలోనే మందులు వాడితే నిర్మూలించవచ్చన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

కాల్పులపై సమగ్ర విచారణ చేయాలి

ఆదోని టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తర్‌ప్రదేశ్‌లో పోలీసు కాల్పుల ఘటనపై సమగ్ర విచారణ చేయాలని ముస్లిం జేఏసీ నాయకులు డిమాండ్ చేసారు. ఈ మేరకు గురువారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు గురువారం వినతిపత్రం ఇచ్చారు. కాల్పుల్లో 5మంది మరణించడం బాధాకరమని, మృతుల కుటుంబాలకు రూ.50లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. 1991 ప్రార్థనా స్థలాల చట్టం కింద 1947కు పూర్వం ఉన్న గుడి, మసీదుల జోలికి వెళ్ళరాదని సుప్రీంకోర్టు కింది కోర్టులకు ఆదేశించాలని కోరారు. నాయకులు ఎంహెచ్‌పీయస్ రాష్ట్ర కార్యదర్శి నూర్ అహమ్మద్, ఎస్‌డీపీఐ పట్టణ అధ్యక్షుడు గౌస్, ఎంఐఎం అద్యక్షుడు జునైద్, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎండీ నూర్ అహమ్మద్ మానసవ హక్కుల సంఘం నాయకుడు జక్రియ పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

బైకులు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

పత్తికొండ, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పందికోన రహదారిలో గురువారం ఉదయం రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు.. తుగ్గలి మండలం రాతన గ్రామానికి చెందిన రాంప్రసాద్ పనినిమిత్తం బైక్‌పై పందికోన గ్రామానికి వెళ్లి తిరిగివస్తుండగా పత్తికొండ నుంచి దేవనకొండ నరస్యామల గ్రామానికి వెళుతుండగా రాంప్రసాద్ బైక్ ఢీకొట్టింది. రాంప్రసాద్ రహదారిపై పది మీటర్ల దూరంలో ఎగిరిపడి, ముక్కు తెగి కాలికి తీవ్రగాయాలయ్యాయి. మరో బైక్‌పై ఉన్న వెనుక కూర్చున్న నారాయణస్వామికి కుడికాలి వేళ్లు రెండు తెగిపోయాయి. వీరిని కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిత్ర లేఖనంలో విద్యార్థుల ప్రతిభ

ఆలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చిత్ర లేఖన పోటీల్లో అరికెర అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు ప్రతిభ కకనబరిచారు. గురువారం జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి సంతోష్, జోష్, ప్రేమ్ రాజ్, శ్రీదర్, అనిల్ జూనియర్ విభాగంలో ఋషి కుమార్, చిన్న జాన్, అధ్యాపకులు అచ్చయ్యను అభినందించారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఫిజీషియన్లు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ బాలాజీ సూచించారు. గురువారం డిపో ఆవరణలో రోటరీ క్లబ్ తుంగభద్ర జోన్-5 ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు శ్రీనివాసులు, బాలాజీ, అవినాష్, రాఘ వేంద్ర, గోవిందరాజులు, శాలి జమీర్, కౌశిక్ గుప్తా సోమిశెట్టి, సైపుల్ల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందు లను పంపిణీ చేశారు. అవరస మైన వారికి మెరుగైన చికిత్స కోసం రిఫర్ చేశారు. క్లబ్ అధ్యక్షుడు సందీప్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ సాయిపుల్ల, ఇన్‌చార్జి డీఎం అమర్నాథ్, ఏఈ వేణుగోపాల్, హరిబాబు, ప్రశాంత్ గాంధీ, సునీల్ రెడ్డి, జీవన్ సింగ్, భరత్, రాజేష్ హితేష్, హుస్సేన్ పాషా పాల్గొన్నారు.

టీబీ యూనిట్ ఆకస్మిక తనిఖీ

ఆదోని టౌన్ , నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీబీ, కుష్ఠు నిర్మూలన జిల్లా అధికారి మల్లికార్జున గురువారం టీబీ, లెప్రసీ యూనిట్లను ఆకస్మిక తనిఖీ చేశారు. రిజిస్టర్, పౌష్టికాహారకిట్లు, వివరాలను పరిశీలించి, సిబ్బందిని ప్రశంసించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డా సత్యవతి, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డా. శేకున్ భాను, డా మైనాజ్ బేగం, సిబ్బంది బాబు రాజు, సీతారాముడు పాల్గొన్నారు.

వైద్యసేవలు వినియోగించుకోండి

దేవనకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మొబైల్ వైద్యసేవలను వినియోగించుకోవాలని ఆర్యోగ విస్తరణ అధికారి రంగస్వామి సూచించారు. గురువారం తెర్నేకల్ గ్రామంలో సచివాలయం వద్ద కర్నూలు వచ్చిన మొబైల్ స్కానింగ్ సెంటర్‌తో ఉచితంగా ఎక్సరే పరీక్షలు నిర్వహించారు. క్షయ, దగ్గు, జ్వరము, జలుబు, తదితర వ్యాదులపై పరీక్షలు చేసినట్లు తెలిపారు.

గ్రామాల్లో క్యాన్సర్ పరీక్షలు



క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మద్దికెర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం. అగ్రహారం గ్రామాల్లో వైద్యాధికారి రాగిణి ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికా మాట్లాడుతూ క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే జయించవచ్చని తెలిపారు. హెల్త్‌ఎడ్యుకేటర్ అక్బర్ బాషా, సీహెచ్‌వో నిరంజన్‌బాబు, ఏఎన్ఎం గాయత్రీ తదితరులు ఉన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే వర్ధంతి



ఆదోనిలో నివాళి అర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

ఆదోని టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 133వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. బీసీ నాయకులు నీలకంఠప్ప, ఎండీ బసవరాజ్ స్వామి, సాకరే మల్లేశ్వర రావు, సాయినాథ్ మాట్లాడుతూ, దేశంలో బీసీ కుల గణన చేసి రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50శాతం సీట్లను కేటాయించాలని, ప్రైవేటులో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. రసాలే గోవిందరావు, కోళ్ల ఆంజనేయులు, మురళీ ధర్ గౌడ్, మంజునాథ్, కుమారస్వామి పాల్గొన్నారు.

దార్శనికుడు పూలే : న్యాయధికారి

పత్తికొండ టౌన్: బీసీల అభ్యున్నతికి కృషి చేసిన దార్శనికుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని న్యాయాదికారి ఎంఎస్ భారతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి అన్నారు. గురు వారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. కార్యదర్శి మహేష్, ఉపాధ్యక్షుడు రవి కోశాధి కారి రాజశేఖర్, సహాయ కార్యదర్శి వాసు, న్యాయవాది సురేష్, మైరాముడు పాల్గొన్నారు. బాలికల పాఠశాలలో జైభీమ్ ఫౌండేషన్ సోమన్న నివాళి అర్పించారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

మద్దికెర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజులు, మండల మైనార్టీ నాయకుడు సాయి నగర్ బాషా అన్నారు. గురువారం కురువ వీదిలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. హామీ మేరకు పింఛన్లను పెంచారని, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నారని గుర్తు చేశారు. వైసీపీ హయాంలో మేలు కలగలేదన్నారు. నాగరాజు ఉన్నారు.

విషజ్వరాల పట్ల జాగ్రత్త తీసుకోండి



నగరూరులో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆస్పరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విషజ్వరాల పట్ల జాగ్రత్త తీసుకోవాలని జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు ప్రజలకు సూచించారు. గురువారం ఆస్పరి, నగరూరు గ్రామాల్లో జ్వర పీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు ఊహకందని విధంగా ఉన్నాయని వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. డ్రైనేజీని శుభ్రం చేయించుకోవాలని దోమతెరలను వాడాలని సూచించారు. సూపర్వైజర్ శ్రీనివాసులు, వసంత కుమారి, రాజారావు, ఏఎన్ఎం సుజాతమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కృష్ణవేణి

వెల్దుర్తి, నవంబరు 28(ఆంధ్ర జ్యోతి): పోషకాహారంతోనే ఆరోగ్యంగా జీవించవచ్చని స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి అన్నారు. గురువారం పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో ఆరోగ్య భారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కిశోర బాలికలు తీసుకోవాల్సిన ఆహార వివరాలను తెలియజేశారు వార్డెన్ శైలజ, బిజేపీ నాయకురాలు శాంతి, ట్యూటర్ గఫూర్ ఉన్నారు.

ఈ క్రాప్ నమోదు చేయించాలి

పత్తికొండ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రబీలో ఈ క్రాప్ నమోదు చేయించాలని ఏడీఏ విజయ మోహన్ కుమార్ సూచించారు. గురువారం పట్టణంలో రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఎవరైనా గంజాయి సాగు చేసిఉంటే సమాచారం ఇవ్వాలని సూచించారు. డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, కర్నూలు ఏడీఏ బాలవర్ధిరాజు, డీఆర్‌సీ ఏవో శశిధర్ రెడ్డి, మౌనిక పాల్గొన్నారు.

పంటనమోదు చేసుకొండి

దేవనకొండ: రబీలో పంట నమోదు చేసుకోవాలని ఏవో సురేష్ బాబు తెలిపారు. దేవనకొండలో పంటనమోదును ప్రారంభించారు. శనగలో సస్యరక్షణ పాటించి పచ్చ, రబ్బరు, లద్దె పురుగుల నుంచి పంటను సంరక్షించుకోవాలని సూచించారు. పంట నమోదు చేసుకుని, డిసెంబరు 15లోగా బీమా చెల్లించాలన్నారు.

ఉపాధ్యాయ శిక్షణను వేసవిలో నిర్వహించాలి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను వేసవి సెలవుల్లో నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి బి.గోపాల్ డిమాండ్ చేశారు. గురువారం ఆదోని కౌతాళం మండ లాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఫౌండేషనల్ లిట్రసీ న్యూమరస్ పేరుతో నిర్వహిస్తున్న శిక్షణ తమ పాలిట శాపంగా మారిందన్నారు. మృతిచెందిన ఉపాధ్యాయుల కుటుంబాలకు రూ.50లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, రాము, సుధాకర్ బాబు, మౌలాలి సాహెబ్, మారయ్య, మహానంది, రాజేష్ రామాంజినేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపాల్

సమస్యలను పరిష్కరించాలి

ఆదోని రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని 104 ఉద్యోగులు మోహన్ రాజు, మధు, జీవన్, ఆంజనేయులు కోరారు. గురువారం ఎమ్మెల్యే పార్థసారధికి వినతిపత్రం సమర్పించారు. పెండింగ్ వేతనాలను చెల్లించాలని, 104 సేవలను ప్రభుత్వమే పీహెచ్‌సీలద్వారా నిర్వహించాలన్నారు. 2020 తరువాత చేరిన డ్రైవర్ డీఈవోలకు జి.ఓ నెం.7 ద్వారా వేతనాలను చెల్లించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య



పత్తికొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు డీఎస్పీ వెంకట్రామయ్య అన్నారు. ఆయన ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: సమస్యాత్మక, ఫ్యాక్షన్ గ్రామాల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు: పత్తికొండ, ఆలూరు పరిధిలో ఫ్యాక్షన్ గ్రామాలున్నా ప్రస్తుతం మార్పు వచ్చింది. అయినా ఇప్పటికీ 11 గ్రామాలు ఫ్యాక్షన్ కేటగిరిలో ఉన్నాయి. ఈ గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు ఏసి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుం టున్నాం.

ప్రశ్న: గతంలో పల్లెనిద్ర అన్ని గ్రామాల్లో చేసేవారు. కానీ నేడు కొన్నిచోట్ల మాత్రమే చేస్తున్నారెందుకు?

జవాబు: ఫ్యాక్షన్, సమస్యాత్మక గ్రామాల్లో పల్లెనిద్ర నిర్వహిస్తుంటాం. ఫ్యాక్షన్‌తో కలిగే నష్టాలను పోలీసు అధికారులు ప్రజలకు వివరించి, వారిలో తేవడానికి ప్రయత్నిస్తారు.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు ?

జవాబు: వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల పరిధిలో జాతీయ రహదారి 44 ఉంది. ఎన్‌హెచ్‌ఏఐ సహ కారంతో యాక్సిడెంట్ జోన్లలో ప్రమాద సూచికలు, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటుచేస్తున్నాం, డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: కర్ణాటక మద్యాన్ని అరికట్టేందుకు ఏ చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు: చత్రగుడి చెక్‌పోస్టువద్ద కర్ణాటక మద్యం అధికంగా రవాణా అవు తోంది. ప్రస్తుతం నూతన మద్యం పాలసీవితో కర్ణాటక మద్యం అక్రమరవాణా తగ్గింది.

ప్రశ్న: సైబర్ మోసాలను అరికట్టే చర్యలు.?

జవాబు: సైబర్, ఆన్‌లైన్ నేరాలపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బాధితులు పోలీసులను ఆశ్రయిస్తే డబ్బును తిరిగి తెప్పించేందుకు అవకాశం ఉంటుంది. సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు అపరిచితులకు ఇవ్వరాదు.

ప్రశ్న: సిబ్బందికొరత ఉందా?

జవాబు: ఈ ప్రాంతంలో పనిచేసేందుకు సిబ్బంది ఆసక్తిచూడం లేదు. ఇక్కడకు బదిలీ అయినవారు ఏదో ఓ కారణంతో వేరే స్టేషన్లకు మారుతున్నారు.

'టీడీపీని బలోపేతం చేయాలి'



జెండా ఊపి కొత్త బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీలో పాత, కొత్త నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మిగనూరు మండలం పార్లపల్లి గ్రామ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, ఆయన సోదరుడు వైసీపీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి, అనుచరులు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీలను విస్మరించిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గ్రామాల అభివృద్ధికి, సాగు, తాగునీరు అందించటమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్లపల్లి, గువ్వలదొడ్డి గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

● **కొత్త బస్సులు ప్రారంభం:** ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో నుంచి ఇతర ప్రాంతాలకు కొత్త బస్సులను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రారంభించారు. గురువారం ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మిగనూరు- నెల్లూరుకు రెండు, తిరుపతికి ఒకటి, కర్నూలు- గూడూరు మార్గాల్లో ఒక్కొక్క బస్సు చొప్పున నాలుగు కొత్తబస్సులకు ఎమ్మెల్యే పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మిగనూరు డిపోనుంచి 12కొత్త బస్సులు ప్రారంభించామన్నారు. ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది మాబు, టీడీపీ నాయకులు బడేసాబ్, అల్తాఫ్, నవాజ్, రామకృష్ణ నాయుడు, రంగస్వామి, అంజి, శాలేమ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన టీడీపీ నాయకులు

నందవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని హలహర్వి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, రైస్ మిల్లు అసోసియేషన్ ఎమ్మిగనూరు తాలుకా అధ్యక్షుడు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ చిన్న నరసింహారెడ్డి, తనయుడు హాలహర్వి గోవర్ధన్ రెడ్డికి చిన్నకొత్తిలి డిస్ట్రిబ్యూటరీ చానల్ 1కు చైర్మన్‌గా, అలాగే బోయ ఎర్రం నాయుడుకు గంగవరం డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌గా ఎంపికకు ఎమ్మెల్యే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జగన్నాథరెడ్డి, బోయ నాగరాజు, దావీదు, ప్రభుదాస్, రాఘప్ప పాల్గొన్నారు.

ధార్మిక పర్యటనకు వెళ్లిన పీఠాధిపతి

మంత్రాలయం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ధార్మిక పర్యటనకు తన శిష్య బృందంతో కలిసి గురువారం బయలుదేరివెళ్లారు. గంగావతి సమీపంలో అనుగొందిలో వెలసిన నవబృందావనంలో రాఘవేంద్రస్వామి గురువులు పద్మనాభతీర్థుల ఆరాధనోత్సవాల్లో పాల్గొని డిసెంబరు 1న మంత్రాలయం రానున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. గురువారం కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో వివిధ అభివృద్ధి పనుల ఆమోదం కోసం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి

మంత్రాలయం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం సమీపంలో ఎమ్మిగనూరు హైవేలో అయ్యప్పస్వామి గుడి దగ్గర జింకను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో జింక అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు జింక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందని గుర్తించి జింకకు పోస్టుమార్టం నిర్వహించారు. జింక మృతి పట్ల సీసీ కెమెరాల ద్వారా వాహనాన్ని గుర్తిస్తున్నట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు.

శ్రీమఠంలో పాదయాత్రికుల పూజలు



మంత్రాలయానికి వచ్చిన భక్తులు

మంత్రాలయం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి దాదాపు వంద మంది భక్తులు పాదయాత్రగా వచ్చి రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. కార్తీకమాసం, శ్రావణమాసాల్లో రెండు పర్యాయాలు దాదాపు 200 కి.మీ. పాదయాత్రగా వచ్చి రాఘవేంద్రస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కర్ణాటక గెస్టుహౌస్ నుంచి రాఘవేంద్రసర్కిల్ మీదుగా మధ్వమార్గ్ కారిడార్ మీదుగా పాదయాత్రగా వచ్చి స్వామివారిని దర్శించుకుని పీఠాధిపతి ఆశీస్సులు పొందారు.

గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే: ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మనిషిని మహోన్నత వ్యక్తిగా తీర్చిదిద్దేది విద్య ఒక్కటే అని సమాజానికి చాటి చెప్పిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కొనియాడారు. పూలే వర్ధంతిని స్థానిక కుర్ని కల్యాణ మండపంలో నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే బీవీ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పూలే, అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి: పూలే, అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణంలోని పూలే, అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పూలే వర్ధంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.



ఎమ్మిగనూరులో పూలేకు నివాళి అర్పిస్తున్న వైసీపీ నాయకులు

అలాగే సామాజిక కార్యకర్త రామచంద్రను పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకురాలు ప్రతిభా భారతి, నరసన్న, ఆయా ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు, కృష్ణయ్య, టీడీపీ నాయకులు కదిరికోట ఆదెన్న, ప్రసాద్, నాగరాజు, మహానంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో గురువారం జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు, వీరశైవ లింగాయత్ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు వై రుద్రగౌడ్, సునీల్, నాగేషప్ప, సుధాకర్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలో వైష్ణవి డిగ్రీ కళాశాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి నివాళి అర్పించారు. విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నరసన్న యాదవ్, నాయకులు రామకృష్ణ, బాష, జగన్నాథ్ పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లో జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. గురువారం ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ సంఘం నాయకులు నరసింహులు, మండల అధ్యక్ష కార్యదర్శులు పవన్, రంగస్వామి, రియాజ్, ఓంకార్, శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి



గోనెగండ్లలో..

అనుమతులు లేకుండా ఎలా నిర్వహిస్తారు?

● డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి
● ప్రైవేట్ పాఠశాల నిర్వాకంపై ఆగ్రహం

గోనెగండ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా ఎనిమిదో తరగతి పిల్లలకు ఎలా బోధిస్తారని డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు. గురువారం గోనెగండ్ల మండల పరిధిలోని పలు గ్రామాలలోని ఉన్నత, ప్రాథమిక, ప్రైవేట్ పాఠశాలలను డిప్యూటీ డీఈవో తనిఖీ చేశారు. గోనెగండ్లలోని జీనియస్ గ్లోబల్ స్కూల్‌పై పలు ఫిర్యాదులు అందడంతో మొదట తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పాఠశాల వెనుక వైపు ప్రహరీకి అనుకొని పెట్రోల్ బంకు ఉండటాన్ని గమనించి.. మూడు గదులను మూసివేయాలని హెచ్చరించారు. అలాగే పాఠశాలలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఎనిమిదవ తరగతి పిల్లలకు బోధన చేయడం, అందుకు సంబంధించిన రికార్డులు లేకపోవడంతో పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల యజమానికి వేరే చోట పాఠశాల ఉండటం, ఇక్కడి విద్యార్థుల పేర్లను చేర్చి అక్కడ హాజరు వేయడం గుర్తించారు. ఇలాంటి పనులు మానుకోవాలని హెచ్చరించారు. తప్పును సరిదిద్దుకోకపోతే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ డీఈవో తనిఖీల్లో గ్లోబల్ స్కూల్ గుట్టు బయట పడిందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. అలాగే మండలంలోని గోనెగండ్ల ఉన్నత పాఠశాల, కులుమాల పాఠశాల, మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ విద్యాసంవత్సరంలో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ జనరేట్ చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో నీలకంఠ, రామాంజినేయలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డిప్యూటీ డీఈవో

రాఘవేంద్రుని సన్నిధిలో ఆదోని సబ్ కలెక్టర్



మంచాలమ్మకు హారతులు ఇస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

మంత్రాలయం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామిని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ గురువారం దర్శించుకున్నారు. మఠం అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘ వేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మఠం పండితులు సబ్ కలెక్టర్‌కు మెమెంటో శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి, మేనేజరు వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, దేశాయ్ నరసింహస్వామి, వ్యాసరాజాచార్, డీటీ గురురాజారావు, ఆర్ఐ ఆదాం, వీఆర్వోలు భీమన్నగౌడు, భీముడు, ఆనంద్, నరసప్ప, శ్వేత, రాజు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

మంత్రాలయం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామ సభల్లో అర్జీలు పెట్టుకున్న ప్రతి రైతుకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. గురువారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ వీఆర్వోలు, సర్వేయర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల కొలతలు, భూసరిహద్దులు, కోర్టు కేసుల వంటి అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించి రైతులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రవి, డిప్యూటీ తహసీల్దార్ జీకే గురురాజరావు, జయరామిరెడ్డి, ఆర్ఐ ఆదాం, మండల సర్వేయర్ అశోక్, వీఆర్వోలు భీమన్నగౌడు, భీముడు, ఆనందు, నరసప్ప, రాజు, శ్వేత, ప్రభాకర్, తిమ్మేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న దండు వీరయ్య మాదిగ

మంత్రాలయం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేసి మాదిగలకు న్యాయం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. గురువారం మంత్రాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ దళితులు గ్రామీణ ప్రాంతాల్లో అంటరానితనం, కుల వివక్షత, ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వర్గీకరణ ద్వారానే మాదిగలకు న్యాయం జరుగుతుందన్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి యేబు, ప్రభుదాసు, మాణిక్యరాజు, దేవదాసు, కుమార్, అబ్రహాం పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు వేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో మణిమంజరి

గోనెగండ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులకు హాజరుకు తగ్గ వేతనం అందుతుందని, ప్రతి ఉద్యోగి తప్పని సరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని ఎంపీడీవో మణిమంజరి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని అన్నారు. ఉదయం 10గంటలలోపు కార్యాలయాలలో బయోమెట్రిక్ తప్పని సరిగా వేయాలన్నారు. బయోమెట్రిక్ లేని రోజు జీతం కట్ అవుతుందని తెలిపారు. సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరించే విధంగా ఉద్యోగులు చర్యలు తీసుకోవాని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు మార్చాలి

మంత్రాలయం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం సూగూరు గ్రామంలో కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి తమ పొలాలకు వెళ్లే రస్తా మధ్యలో వేసిన విద్యుత్ స్తంభాలు మార్చాలని గ్రామానికి చెందిన గాబ్రియేలు విద్యుత్ అధికారులను కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ గతంలో ట్రాన్స్‌కో ఏఈకి విద్యుత్ స్తంభాలు వేయొద్దని చెప్పామని తెలిపారు. ఈ స్తంభాల వల్ల తమ పొలాలకు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. విద్యుత్ స్తంభాలను మార్చాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ

నందవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప డిమాండ్ చేశారు. గురువారం ఈవోపీఆర్డీ సందీప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఎస్సీ కాలనీలో మూడు రోజులకు ఓ సారి తాగునీరు వస్తుందని తెలిపారు. తాగునీటిని ప్రజలు డబ్బులు పెట్టి కొనాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే అధికారులు తాగునీటి సమస్య పరిష్కరించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు.. కార్యక్రమంలో నాయకులు రత్నం, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సబ్ కలెక్టర్‌కు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల వినతి



సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం ఇస్తున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు

మంత్రాలయం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో సంక్షేమ, విద్య సహాయకులుగా పని చేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజకు ఆ సంఘం నాయకులు వరప్రసాద్, వెంకటేశ్, లక్ష్మణ్ యాదవ్, ప్రకాష్ కోరారు. గురువారం రీసర్వే విచారణలో భాగంగా మంత్రాలయం మండలం కల్లుదేవకుంటకు వచ్చిన సబ్ కలెక్టర్‌కు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి, ఆర్ఐ ఆదాం, మండల సర్వేయర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఇక్కట్లు తీరినట్లే..

ప్రత్యేక స్థలంలో పత్తి వాహనాలు నిలుపుదల



మిల్లు పక్కనే ప్రత్యేక స్థలంలో నిలిపిన పత్తి వాహనాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నందవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి దగ్గర ఎమ్మిగనూరు నుంచి మంత్రాలయం వెళ్లే హైవే రోడ్డులో పత్తి మిల్లుల దగ్గర పత్తి రైతు పాట్లు.. రోడ్డుమీదే వాహనాలు.. అన్న కథనం 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైంది. దీంతో పత్తిమిల్లు యజమాని మహాబలి మిల్లు పక్కనే ప్రత్యేక స్థలంలో రైతులకు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా వాహనాలు నిలుపుకునేందుకు ఏర్పాటు చేయించారు. మిగతా మిల్లు యజమానులు కూడా ఇలాగే ఏర్పాటు చేస్తే హైవే రోడ్డులో ట్రాఫిక్ సమస్య తీరినట్లేనని రైతులు, ప్రయాణికులు అంటున్నారు.

ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోనే ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ కోరారు. గురువారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్‌లో విద్యార్థుల ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయడంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఉన్నతాధికారులు విద్యార్థుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని పాఠశాలల్లోనే ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో దస్తగిరి, హరీష్, కుమార్‌లు పాల్గొన్నారు.

గ్రామ న్యాయాలయాల ఏర్పాటు సరికాదు

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేయడం సరికాదని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గురు రాజారావు, సెక్రటరీ రఘురాం అన్నారు. గురువారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేస్తే న్యాయవ్యవస్థపై ఉన్న గౌరవాన్ని ప్రజలు కోల్పోతారన్నారు. మరికొన్ని కోర్టులను ఏర్పాటు చేస్తే సత్వరన్యాయం జరుగుతుందన్నారు. నియోజకవర్గ స్థాయిలో న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆనంద్, నాగరాజు, బాషా, కుమార్, రంగనాథ్, నాగన్న, హనుమంతు, రషీద్, ఇర్షాద్, జయచంద్ర పాల్గొన్నారు.

మిరప రైతులను ఆదుకోవడంలో విఫలం

పెద్దకడబూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మిరప రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని రైతు సంఘం నాయకులు భాస్కర్‌యాదవ్, వీరేష్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన పెద్దకడబూరు బస్టాండ్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ మిరప రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. మిరప రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మారెప్ప, మదర్‌సాబ్, రజప్ప, బుడ్డన్న, ముక్కన్న, బాషా, మహబూబ్ పాల్గొన్నారు.

గంజహళ్లి ప్రధాన రహదారి గుంతలమయం



గుంతలు పడిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

గోనెగండ్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్ల, గంజహళ్లి ప్రధాన రహదారి గుంతమయంగా మారింది. వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం కనిపించలేదని గ్రామస్థులు వాపోతున్నారు. కొన్నిమాసాలుగా గుంతలు పడిన రోడ్డుపై వెళ్లేందుకు జంకుతున్నారు. గోనెగండ్ల నుంచి గంజహళ్లికి పది నిమిషాలలో వెళ్లే ప్రయాణం అరగంటకుపైగానే పడుతుందని వాహనదారులు వాపోతున్నారు. గర్భిణులు, వృద్ధులు ఆటోల్లో కూర్చునేందుకు ఇబ్బంది పడుతున్నారు.

పలువురు ప్రమాదానికి గురైన సందర్భాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.